తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త





## ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

### - కలెక్టర్ సుమిత్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



చిత్తూరు, జూన్ 24 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తానని జిల్లాకు నూతన కలెక్టర్‌గా నియమితులైన సుమిత్ కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో సోమవారం కలెక్టర్‌గా సుమిత్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. కలెక్ట రేట్‌కు చేరుకున్న నూతన కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు కాణి పాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారి వేద పండితులు మంత్రోచ్ఛారణలతో స్వాగతం పలుకగా డిఆర్‌ఓ బి.పుల్ల య్య, డ్వామా పిడి రాజశేఖర్‌లు స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ తాను గతంలో పశ్చిమ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వర్తించడం జరిగిందని, ప్రజా సమస్యలను పరిష్కరించడానికి తాను అధిక ప్రాధాన్యత ఇస్తానన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పలువురు అధికారులు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు.

## జలకంఠేశ్వర ఆలయాన్ని ధ్వంసంచేసిన ఏనుగులు

### -భయాందోళనలో సమీపగ్రామాల ప్రజలు

పెద్దపంజాణి, జూన్ 24 ప్రభాతవార్త : మండలంలోని కోగిలేరు అటవీప్రాంతంలో వెలసిన శ్రీ జలకంఠేశ్వరస్వామి ఆలయాన్ని ఆధివారం రాత్రి ఏనుగులు ధ్వసంచేసాయి. ఆలయానికి అమర్చిన ఇనుపగేట్లను ధ్వంసంచేయడంతోపాటు ఆలయగోడలను సైతం నేలకూల్చాయి. దీంతో దాదాపు రూ.50వేలదాకా నష్టంవాటిల్లినట్లు తెలుస్తోంది. హఠాత్తుగా ఏనుగులు ఆలయాన్ని ధ్వసంచేయడం పట్ల స్థానిక ప్రజలతోపాటు చుట్టుపక్కల గ్రామాలప్రజలు ఏ క్షణాన ఏనుగులు ఏమూలనుంచి దాడులుచేస్తాయోనని ఆందోళనలు వ్యక్తంచేస్తున్నారు.అటవీఅదికారులు స్పందించి ఏనుగులను దారిమళ్ళించాలని కోరుతున్నారు.కాగా అటవీ అధికారులు మాట్లాడుతూ రాత్రిపూట రైతులు ఎవరూ పంటపొలాలవైపు వెళ్ళవద్దని సూచించారు.



ధ్వంసంచేసిన గోడ, గేటు

# కుప్పంకు ఇక 'చంద్రోదయమే'

### కృష్ణా జలాల తరలింపే తొలి లక్ష్యం.. పశ్చిమాన గజదాడుల వెతలకు తెరపడేనా..? నేటి నుంచి కుప్పంలో సి.ఎం. చంద్రబాబు పర్యటన !!



కుప్పం, జూన్ 24 ప్రభాతవార్త రాష్ట్రంలో చిట్ట చివరి నియోజకవర్గమైన కుప్పం ప్రాంత ప్రజల జీవితాల్లో వెలుగులు 'చంద్రోదయం' వచ్చింది. వైఎస్సార్సీ పాలనలో పట్టిన అభివృద్ధి నిరోధక గ్రహణం వీడింది. రాష్ట్ర ముఖ్య మంత్రిగా నారా చంద్రబాబునాయుడు నాలుగోసారి బాధ్యతలు చేపట్టడంతో ముమ్ముందు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పరుగులు తీస్తాయని కుప్పం ప్రాంత ప్రజలు భావిస్తున్నారు. కుప్పం నియోజకవర్గ రైతులు, ప్రజలకు సాగు, తాగునీరు అందించేందుకు చేపట్టిన హంద్రీ-నీవా కాలువల నిర్మాణాలను చివరి పాయింట్ అయిన కుప్పం మండలం పరమసముద్రం చెరువు వరకు చేపట్టి కృష్ణాజలాలను సాధ్యమైనంత త్వరగా కుప్పం ప్రజలకు అందించేలా సిఎం చంద్రబాబునాయుడు చర్యలు తీసుకుంటారని ఈ ప్రాంత రైతులు, ప్రజలు భావిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి రామకుప్పం వద్ద హంద్రీ-నీవా జలాలు ప్రారంభించడం, రెండు రోజులకే అక్కడ జలాలు ఎండిపోయిన వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా అప్పట్లో చర్చకు దారితీసిన విషయం విదితమే. అందుకే తన తొలిరోజు పర్యటనలో సిఎం చంద్రబాబునాయుడు హంద్రీ-నీవా కాలువలను స్వయానా క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. కృష్ణాజలాలను పూర్తిస్థాయిలో కుప్పానికి తీసుకువచ్చేలా పనులు త్వరగా పూర్తి చేయించే సూచనలు కనబడుతున్నాయి. అందుకు అవసరమైన నిధులను కూడా సిఎం చంద్రబాబునాయుడు మంజూరు చేస్తూ ప్రకటిస్తారని రైతులు ఆశగా ఉన్నారు. అలాగే ఎన్టీఆర్ మానసపుత్రిక ద్రవిడ వర్సిటీలో పదకొండు నెలలుగా వేతనాలు అందని తాత్కాలిక ఉద్యోగులు కూడా తమను సిఎం చంద్రబాబు ఆదుకుంటారని ఎదురుచూస్తున్నారు.

**గజరాజుల కట్టడికి ప్రత్యేక చర్యలు అవసరం :**

కౌండిన్య రాయల్ ఎలిఫెంట్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్న కుప్పం, పలమనేరు, చిత్తూరు నియోజకవర్గాల్లో తరచూ గజరాజులు పంట పొలాలపై దాడులు చేస్తూ రైతులకు పంటనష్టం కలిగిస్తున్నాయి. ఏనుగుల దాడుల్లో ఒక్కోసారి రైతులు, ప్రజలు కూడా ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవలే అటవీ శాఖ అధ్వర్యంలో జిల్లాలో ఏనుగుల సంచారంపై సర్వే చేయగా సుమారు 116 ఏనుగులు చిత్తూరు జిల్లా అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు అటవీ అధికారులు గుర్తించారు. కుప్పం అటవీ పరిధిలో 14-15 దాకా ఏనుగులు సంచరిస్తున్నాయని అటవీ అధికారులు పేర్కొంటున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కుప్పం నియోజకవర్గంలో ఏనుగుల దాడుల నిరోధానికి ఏర్పాటుచేసిన ట్రెంచ్‌లు (కందకాలు) మట్టిలో పూడుకుపోగా సోలార్ ఫెన్సింగ్ పనిచేయడం మానేసింది. అక్కడక్కడా ఏర్పాటు చేసిన ఇనుప గేట్లు అలంకార ప్రాయంగా మారాయి. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలనుంచి ఏనుగులు రాకుండా ఉండాలంటే పటిష్టమైన ట్రెంచ్‌లు, సోలార్ కంచెను ఆధునీకరించాల్సిన అవసరం ఉంది. 2014 అక్టోబర్ నెలలో కుప్పం నియోజకవర్గంలో ప్రారంభించిన 2రూ.లకే ఇరవై లీటర్ల ఎన్టీఆర్ సుజల జలాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పలుచోట్ల అందడం లేదు. దీంతో పాటు కుప్పం పట్టణంలో సగంలో ఆగిపోయిన ప్రధాన రహదారి విస్తరణతో పాటు వైకాపా పాలనలో అడుగు ముందుకు పడని కుప్పం చుట్టూ రింగ్ రోడ్డు నిర్మాణాన్ని సైతం అతి త్వరలో మొదలవుతాయని ప్రజలు భావిస్తున్నారు. ముప్పావు వంతు పనులు పూర్తి చేసుకున్న పలు కమ్యూనిటీ భవనాలకు ఐదేళ్ల వైకాపా పాలనలో మోక్షం కలగలేదు. ముఖ్యమంత్రి మరలా పట్టాలెక్కిస్తారని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

### నేడు..రేపు సిఎం చంద్రబాబు కుప్పం పర్యటన

*కుప్పం, జూన్ 24 ప్రభాతవార్త :రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 25,26 తేదీల్లో తన సొంత నియోజకవర్గం కుప్పంలో పర్యటించనున్న విషయం విదితమే. సిఎం చంద్రబాబు కుప్పం పర్యటన వివరాలిలా.. ఈనెల 25వతేది మంగళవారం మధ్యాహ్నం 12.30గంటలకు కుప్పం పిఇఎస్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 1.00-1.30గంటలమధ్య కుప్పంలో అన్న క్యాంటీన్ ప్రారంభిస్తారు. 1.30-3గంటల మధ్య కుప్పం బస్టాండులో జరిగే బహిరంగసభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగిస్తారు. 3.30-5.30గంటల మధ్య జిల్లా ఉన్నతాధికారులతో పిఇఎస్ ఆడిటోరియంలో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 6.30-7.30గంటల మధ్య కుప్పం ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొని రాత్రికి అక్కడే బసచేస్తారు. ఈనెల 26న బుధవారం ఉదయం 10-11గంటల దాకా చిత్తూరు జిల్లా పార్టీ శ్రేణులతో కుప్పం ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో సమావేశమవుతారు. 11-12గంటల మధ్య ప్రజలనుంచి వినతిపత్రాలు స్వీకరిస్తారు. 12-00-1.00గంటల మధ్య శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లి లేదా చిన్నారిదొడ్డి లేదా జల్లిగానిపల్లి వద్ద హంద్రీ-నీవా కాలువలను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 2.00-4.00గంటల మధ్య పిఇఎస్ ఆడిటోరియంలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన అనంతరం 4.30గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరుతారు.*

### వైభవంగా శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి

# రథోత్సవం



వడమాలపేట, జూన్ 24 ప్రభాతవార్త: అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం శ్రీనివాసునికి రథోత్సవం వైభవంగా జరిగింది. రథంపై అధిరోహించి మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. వేకువ జామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన వేద పండితులు నిత్య కైంకర్యాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 9 గంటలకు వాహన మండపం చేరుకున్న స్వామివారు అలంకరించిన రథాన్ని అధిరోహించారు. ఉదయం 9.25 నుంచి 11 గంటల వరకు స్వామివారు నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ ఆలయ మాడవీధుల్లో కోలాహలంగా రథోత్సవం జరిగింది. అనంతరం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు, కొబ్బరి నీళ్ళతో అభిషేకం చేశారు. సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు ఊంజల్‌సేవ ఘనంగా నిర్వహించారు. తిరిగి వాహన మండపం చేరుకున్న శ్రీవారు రాత్రి 7 గంటలకు అశ్వ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఈఈ నరసింహమూర్తి, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శ్రీవాణి, కంకణ బట్టర్ సూర్యకుమార్ ఆచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, రమణాచార్యులు, వేదపండితులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు మంగళవారం ఉదయం చక్రస్నానం వైభవంగా జరగనుంది. ఇందులో భాగంగా ఉదయం 9.15 నుంచి 10.30 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారికి, చక్రత్తాళ్వార్ వారికి వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు.

## సామాన్యభక్తులకు వీలైనంత త్వరగా సంతోష దర్శనమ్

### క్యూలైన్ల రద్దీని నియంత్రించేలా చర్యలు

### వెంకన్న దర్శనాలు, సేవలపై టిటిడి ఈఓ శ్యామలరావు సమీక్ష



తిరుమల.జూన్ 24ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుమలకు వస్తున్న భక్తులకు వీలైనంత వరకు గంటల తరబడి నిరీక్షణ లేకుండా, త్వరగా స్వామి దర్శనమ్ చేయించేందుకు ప్రణాళికలు రూపొందించే దిశగా టిటిడి ఈఓ జె.శ్యామలరావు పనితీరు సాగిస్తున్నారు. ఇప్పటికే వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లు, అదనపు క్యూలైన్లలో భక్తులు గంటల తరబడి నిరీక్షణ, భక్తుల ఇబ్బందులు గమనించిన ఇఓ తాజాగా సోమవారం తిరుమలలోని వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లలో కంపార్టుమెంట్లు, క్యూలైన్లు, నారాయణగిరి ఉద్యానవనంలోని షెడ్లు, క్యూలైన్లను జెఈఓలు వీరబ్రహ్మం, గౌతమి, సివిఎస్ఓ నరసింహకిశోర్, విఎస్ఓ నందకిశోర్,సిఇ నాగేశ్వరరావు, ఎస్ఇ2 జగదీశ్వర్‌రెడ్డితో కలసి తనిఖీ చేశారు. క్యూలైన్లలో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ఎంతసమయం వేచివుంటున్నారు,ఎన్ని గంటలకు షెడ్లలోకి ప్రవేశించారు అనే వివరాలు ఆరాతీశారు. స్వామివారి ఆలయం, చరిత్ర, విశిష్టత, వాస్తుశిల్పం, సంబంధిత విశేషాలపై సవివరంగా సమీక్షించారు. సోమవారం సాయంత్రం తిరుమలలోని గోకులం అతిథిగృహంలో అధికారులతో సమావేశమై కూలంకుషంగా చర్చించారు. అనంతరం క్యూలైన్లను తనిఖీచేశారు.

# కాణిపాకం ఆలయానికి కొత్త రూపురేఖలు

### జూలై 15 నుండి ఆలయ సిబ్బందికి డ్రస్‌కోడ్ తప్పనిసనరి -పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్

కాణిపాకం, జూన్ 24 ప్రభాతవార్త: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ దర్శనార్థం వచ్చే భక్తులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచనలు, సలహాల మేరకు 50, 60 ఏళ్ళ ముందు చూపుతో అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ అన్నారు. ఎమ్మెల్యే ప్రమాణస్వీకారం చేసిన అనంతరం మొట్టమొదటి సారిగా సోమవారం కాణిపాకం స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్థానిక ఈఓ కార్యాలయం సమావేశ మందిరంలో ఆలయ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి ఆలయంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, భక్తులకు అందుతున్న సేవల గురించి సమీక్షించారు. సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌ల ప్రోత్సాహంతో కాణిపాకం వినాయకస్వామి ఆశీస్సులతో తాను ఎమ్మెల్యే అయ్యానని తెలిపారు. కాణిపాకం ఆలయం వున్న ప్రాంతానికి తాను ఎమ్మెల్యే కావడం ఎంతో అదృష్టమన్నారు. ఈనేపథ్యంలో కాణిపాకం స్వామివారు ఇచ్చిన అవకాశాన్ని భక్తితో ఆలయంలో భక్తులకు కల్పిస్తున్నటు వంటి సౌకర్యాల పట్ల, సామాన్య, సాధారణ భక్తులకు కల్పిస్తున్నట్లు వంటి సౌకర్యాల పట్ల చర్చించడం జరిగిందన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న కార్యక్రమాలను మరింతగా మెరుగుపరచడానికి ఏం చేస్తే బాగుంటుందని ఆలయ అధికారులతో విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు చేసిన సూచనలను పరిగణలోకి తీసుకుని చాలా కాలంగా పురోగతి లేకుండా వున్న మాస్టర్‌ప్లాన్‌ను దాన్ని ముందుకు తీసుకెళ్ళాలనే విషయమై చర్చించడం జరిగిందని మురళీమోహన్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్ర చంద్రబాబునాయుడుకు ఆలయ అభివృద్ధిపై స్పష్టమైన అవగాహన వున్నారని, రాబోవు ఐదేళ్ళలో ఆలయ అభివృద్ధి పరిపూర్ణంగా మారాలని, 50 నుండి 60 ఏళ్ళ ముందు చూపుతో ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించడం జరిగిందని వాటిన్నంటిపై చర్చించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా మొట్టమొదటిగా ఆలయంలో ఆద్మాత్మికత ఉట్టిపడేవిధంగా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఆలయంలో పనిచేసే ప్రతి ఉద్యోగికి నుదిటిన వీభూది తిలకంతో పాటు డ్రస్‌కోడ్‌ను జూలై 15 నుండి అమలు చేయడానికి నిర్ణయించినట్లు ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు.



కాణిపాకం అభివృద్ధిపై జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

## అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ ధ్యాన చంద్ర హెచ్‌ఎం



తిరుపతి కార్పొరేషన్, జూన్ 24, ప్రభాతవార్త ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సకాలంఓ అర్ధవంతమైన పరిష్కారం చూపాలని, లేనిచో చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ధ్యాన చంద్ర హెచ్‌ఎం అధికారులను ఆదేశించారు. నేటి సోమవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌తో పాటు డిఆర్ఓ పెంచల్ కిషోర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మురళి, దేవేంద్ర రెడ్డితో కలిసి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను కలెక్టర్ స్వీకరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం సాధారణంగా నిర్వహించే గ్రీవెన్స్‌ను నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నేటి సోమవారం కలెక్టరేట్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. మీ కోసం - పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పిజిఆర్ఎస్) అనే పేరుతో ప్రతి సోమవారం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి మండలంలోని తహశీల్దార్లు అర్జీదారులు సమస్యలు తిలకించి, విని పరిష్కరించే దిశగా జిల్లా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని వారి కార్యాలయాలకు లైవ్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కనెక్ట్ చేయడం జరిగిందన్నారు.

## చంద్రబాబు పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

### - జిల్లా కలెక్టర్ గాంధీ సుమిత్‌కుమార్



కుప్పం, జూన్ 24 ప్రభాతవార్త రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కుప్పం పర్యటనసందర్భంగా పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ గాంధీ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం కుప్పంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను నూతన కలెక్టర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సిఎం పర్యటన విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం, పోలీసులు అప్రమత్తంగా ఉండాలనిన్నారు. పటిష్ట బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు. హెలిప్యాడ్, పార్కింగ్ వద్ద, బహిరంగ సభ వద్ద ఎలాంటి ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, జిల్లా ఎస్పీ మణిక ంత చందోలుతో కలసి కుప్పం బస్టాండు, ఆర్‌అండ్‌బి అతిథిగృహం, ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ప్రాంతాలను పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డిఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి, డ్వామా పిడి రాజశేఖర్, ఎస్ఇలు చంద్రశేఖర్‌రెడ్డి, విజయ్‌కు మార్, జడ్పీ సిఇఓ గ్లోరియా, పిడిలు తులసి, పద్మ నాభం , రాధమ్మ, చిత్తూరు మున్సిపల్ కమీషనర్ అరుణ, డిటిసి నిరంజన్‌రెడ్డి, ఆర్డీఓలు శ్రీనివాసులు, మనోజ్‌రెడ్డి, చిన్నయ్య, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే

# కఠిన చర్యలు తప్పవు

### ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ అన్వేష్



తిరుపతి కార్పొరేషన్ ,జూన్ 24, ప్రభాతవార్త నగరంలోని పిఎస్ 4 హోటల్‌లో నగర పాలక సంస్థ, ఫుడ్ సేఫ్టీ అధికారులు కమిషనర్ అధితి సింగ్ ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం మరోమారు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అన్వేష్ మాట్లాడుతూ తిరుమల బైపాస్ రోడ్డులోని పెరంబూర్ శ్రీ శ్రీనివాస హోటల్ పై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఈనెల 20వ తేదీన తనిఖీ చేసి సీజ్ చేశామని అన్నారు. తనిఖీలు కనుగొన్న లోపాలను సరిదిద్దుకోవాల్సిందిగా నోటీసులు ఇచ్చామన్నారు. వారి హోటల్ నందు తనిఖీల్లో తెలిపిన లోపాలను సరిదిద్ది తిరిగి తెరుచుకునేందుకు అనుమతి సోమవారం కమిషనర్ అధితి సింగ్‌ను కోరారని అన్నారు. ఈ మేరకు తమ సిబ్బందితో పాటు, జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ మద్దిదేటితో కలిసి హోటల్‌ను తనిఖీ చేశామని అన్నారు. ఆయన వెంట శానిటరీ సూపర్‌వైజర్స్ చెంచయ్య, సుమతి తదితరులు ఉన్నారు.

# చిటపట..చినుకులు..చక..చకా నాట్లు



శ్రీకాళహస్తి,జూన్ 24 ప్రభాతవార్త శ్రీకాళహస్తి సత్యవేడు నియోజకవర్గాల్లో వ్యవసాయ పనులకు అన్నదాతలు శ్రీకారం చుట్టారు. చిటపటా చినుకులు పడుతుంటే అన్నదాతల గుండెల్లో ఆశలు చిగురిస్తున్నాయి. మార్కెట్లో బియ్యం ధరలు విపరీతంగా పెరగటంతో రైతులు మేలు రకాలు,ఉప్పుడు బియ్యం రకాల వరి సాగుకు సిద్ధమౌతున్నారు. ఇప్పటికే నార్లు పోసుకున్న వారు నాట్లు వేసుకుంటూ బిజీగా ఉండగాసత్యవేడు నియోజకవర్గంలో తెలుగుగంగ పుణ్యమా అని చెరువులు కళ కళ లాడుతున్నాయి.దాంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

**వరుణుని కరుణ కోసం నిరీక్షణ . . .**

జిల్లాలోని తూర్పు మండలాల్లో ఈశాన్య రుతుపవనాలతో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి. జిల్లాలోని తూర్పు మండలాల్లో అక్టోబర్‌నుంచి డిసెంబర్ వరకు సుమారు 1,000 మి.మీల వర్షపాతం నమోదు కావటం ఆనవాయితి. అయితే ఇటీవల సంవత్సరాల్లో రుతుపవనాల వర్షాలు కరువయ్యాయి.కేవలం బంగాళాఖాతంలో అల్పపీడనంతో వర్షాలు కురవటం చెరువులు కుంటలు నిండుతున్నాయి. దాంతో వ్యవసాయం ఎత్తుభారంగా మారుతుంది.గత నాలుగు రోజులుగా అడప దడపా వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణం చల్లబడింది.స్వర్ణముఖి తీరాన బోర్లు కింద వ్యవసాయం సాగించే రైతులు కొందరు నార్లు పోసుకుంటుండగా మరి కొందరు నాట్లు పనుల్లో తలమునలకై ఉన్నారు.ముఖ్యంగా చెర్లోపల్లి, తొండమనాడు, వేదాం,రామాపురం గ్రామాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.ఇప్పటికే ఎడిటి 37 ధరలు అధికంగా ఉండటంతో రైతులు ఈ పంటను వేస్తున్నారు. స్వర్ణముఖి నదీ తీరాన గల సుమారు 100 గ్రామాల్లో నదిలో ఒక సారి నీరు పారితే తప్ప బావుల్లో ఊటరాదు..బావులు నిండవు. బోర్లలో భూగర్భజలాలు పెరగవు.దాంతో అన్నదాతలు 'స్వర్ణముఖి పారుతుందా? లేదా? అని ఎదురు చూస్తుంటారు. గత 25సంత్సరాలుగా రుతుపవనాలతో వర్షాలు కురిసి నది పారటంలేదు. దాంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. ఒకప్పుడు స్వర్ణముఖి నదీ తీరాన ఉన్న సన్నిధివీధి, దుర్గాంబ కొండ పరిసరాల్లో కేవలం 30అడుగుల లోతులోనే నీరు వచ్చేది. కానీ నేడు పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. నదీ తీరాన కూడ సుమారు 100 నుంచి 150 అడుగుల లోతు వెళితే తప్ప నీరు లభ్యత లేదు.దాంతో వ్యవసాయం ఎత్తుభారంగా మారుతుంది.పట్టణంలో మంచినీటి సరఫరా తెలుగుగంగపై అధారపడి ఉంది. ఇప్పటి వరకు నది పారలేదు.దాంతో బావులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. బోర్లలో నీరు సన్నగా వస్తుంది. శ్రీకాళహస్తి పరిసరాల్లోని రైతులు నార్లుపోసుకొని నాట్ల కోసం వరుణ దేవుని కరుణ కోసం ఎదురు చూసిన రైతులకు గత మూడురోజులుగా చెదరుమదురు వర్షాలుపడుతున్నా ఓమోస్తారు వర్షాలు మాత్రం పడడం లేదు. బంగాళాఖాతంలో అల్పపీడనంతో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటనతో సంతతోష పడ్డ రైతన్న వర్షం కురుస్తున్న తీరు చూసి 'కరుణించవయ్యా! వరుణ దేవుడా!' అని వేడుకుంటున్నారు.

## సమస్యలకు సత్వర పరిష్కారం : కమిషనర్ అరుణ

చిత్తూరు, జూన్ 24 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని గ్రీవెన్స్ హాలులో సోమవారం మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు నగర ప్రజల నుండి కమీషనర్‌కు తొమ్మిది సమస్యలు ప్రస్తావనకు వచ్చాయి. ఈ సమస్యలను సత్వరం పరిశీలించి పరిష్కరించాలని కమీషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ రామకృష్ణుడు, ఎంహెచ్‌ఓ డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, ఎంఇ గోమతి తదితరులు పాల్గొన్నారు.

## కమిషనరుపై కలెక్టరుకు దళిత సంఘ నాయకులు ఫిర్యాదు

చిత్తూరురూరల్, జూన్ 24 ప్రభాతవార్త:

చిత్తూరు నగర పాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న 12మంది డ్రైవర్లకు గత 9నెలలుగా జీతభత్యాలు ఇవ్వకుండా కమీషనరు వేధిస్తున్నారంటూ జిల్లాకలెక్టరుకు సోమవారం పిర్యాదుచేసారు. కమీషనరు దళితులు అనే నెపంతో బెదిరించి ఆర్థికంగా వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. చట్టపర మైన చర్యలు తీసుకొని బాధితులకు తగు న్యాయం చేయడంతో పాటు వారికి ఐడి కార్డు, పర్మినెంట్ ఉద్యోగం ఇప్పించి ఆదుకోవాలని కోరారు. కలెక్టరును కలిసిన వారిలో దళిత ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షుడు ధనంజయరావు, ఆల్‌ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి శ్రీరంగపల్లి మునస్వామి, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ మెంబరు రాజ్‌కుమార్‌లతో పాటు డ్రైవర్లు వున్నారు.

## దగ్గుమళ్ల ఎంపికపట్ల దళితుల హర్షం

చిత్తూరురూరల్, జూన్ 24 ప్రభాతవార్త:

టిడిపి పార్లమెంటరీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్‌గా దగ్గుమళ్ల ప్రసాద్‌రావు ఎంపికపట్ల దళితసంఘ నేతలు హర్షం వ్యక్తంచేసారు. ఈ అవకాశాన్ని కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షులు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిలకు కృతజ్ఞతలు తెలిపారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో ఆల్‌ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి శ్రీరంగంపల్లె మునస్వామి, దళిత ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షుడు ధనంజయరావు, ఎసి అంబేద్కర్ యువజనసంఘం జిల్లా అధ్యక్షుడు వి.రాజ్‌కుమార్ తదితరులు వున్నారు.

## వరసిద్దుని సేవలో కర్నాటక హైకోర్టు జడ్జి

కాణిపాకం, జూన్ 24 ప్రభాతవార్త:

కర్నాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ కె.నటరాజన్ కుటుంబసమేతంగా సోమవారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి వేదమండపంలో వేదాశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. అలాగే శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా వారు పూజలు నిర్వహించారు. వారి వెంట ఆలయ జూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



## కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జె.అరుణ

చిత్తూరు, జూన్ 24 ప్రభాతవార్త:

కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సుమిత్‌కుమార్‌ను సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో కమీషనర్ డాక్టర్ జె.అరుణ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ రామకృష్ణుడు. ఎంఇ గోమతి తదితరులు పాల్గొన్నారు.

## కుప్పం డిపోకు చేరుకున్న ఆర్టీసీ బస్సులు

### సియం చంద్రబాబు చిత్రపటానికి దేశం నేతల పాలాభిషేకం

కుప్పం రూరల్,జూన్ 24 ప్రభాతవార్త



కుప్పం ఆరీసీ డిపోపరిదిలోఉన్న బస్సులు ఎట్టకేలకు జిల్లాలోని పుంగనూరు,ఇతర ప్రాంతాల డిపోలనుండి కుప్పం డిపోకు చేరుకున్నాయి.దీంతో స్థానిక దేశంనేతలు హర్షం వ్యక్తం చేస్తూ ఆర్టీసీ డిపో ఆవరణలో సీయం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు, కుప్పండిపోలో బస్సుల సంఖ్య పెరగడంతో స్థానిక ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో పరిశీలకుడు గాజుల ఖాధర్ భాషా,మున్సిపల్ టీడీపీ అధ్యక్షుడు రాజుకుమార్,నేతలు వెంకటేశ్,సత్యేంద్రశేఖర్, జాకీర్,దాము, మునెప్ప,అన్సర్,తదితరులు పాల్గొన్నారు.

## గణనాధుని సన్నిధిలో పూతలపట్టు ఎమ్మెల్యే



కాణిపాకం, జూన్ 24 ప్రభాతవార్త:

పూతపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ సోమవారం సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మొట్టమొదటి సారిగా ఆయన కాణిపాకం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ వెంకటేశు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈయనకు వేదమండపంలో వేదాశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. ఎమ్మెల్యే వెంట ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, స్థానిక మాజీ సర్పంచ్ మదుసూదన్‌రావు, నాయకులు ఎన్‌పీ జయప్రకాష్, నరసింహులు నాయుడు, పూర్ణచంద్రరావు, శేషాద్రినాయుడు, మల్లారపల్లె గిరినాయుడు, బాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలపై జగన్ సిబ్బంది దురుసు ప్రవర్తన

### -వైకాపా నేత అమ్ముకుట్టి ఆరోపణ

పుంగనూరు,జూన్ 24 ప్రభాతవార్త :

పులివెందులలోని మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇంటి వద్ద ఆయనను కలవడానికి వచ్చిన కార్యకర్తలపై జగన్ వ్యక్తిగత భద్రతా సిబ్బందికి ఆధ్వర్యం వహించే ఒక వ్యక్తి విచక్షణా రహితంగా దాడిచేశారని, వైకాపా మైనార్టీ నేత అమ్ముకుట్టి ఆరోపించారు. తమ ప్రియతమ నేతను కలవడానికి వెళ్ళిన పుంగనూరు,తాండూరు,మున్నూరు మండలాలకు చెందిన కార్యకర్తల ముఖంపై వ్యక్తిగత సిబ్బంది నుంచి ఒక వ్యక్తి పిడిగుద్దులు కురిపించారన్నారు. జగన్‌ను చూడడానికి కలవడానికి వచ్చిన వారిపై ఆవ్యక్తి దారుణంగా ప్రవర్తించాడన్నారు.

## విద్యార్థులకు రాత పుస్తకాలు, సామాగ్రి పంపిణీ

వెదురుకుప్పం, జూన్ 24 ప్రభాతవార్త :

అగ్గిచేనుపల్లె ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన రాత పుస్తకాలు, ఇతర సామాగ్రిని సోమవారం టీడీపీ యువ నాయకుడు పాఠశాల కమిటీ ఛైర్మెన్ శివకుమార్ విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంకు టీడీపీ మాజీ జిల్లా కార్యదర్శి మోహన్ మురళి అతిథులుగా పాల్గొన్నారు. మండల విద్యాశాఖాధికారులు మహేశ్వరరావు, దావమోధర్, ప్రధానోపాధ్యాయులు అక్బర్, ఉపాధ్యాయులు రవి, అంగన్‌వాడి కార్యకర్త ప్రేమలత,మండల టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షులు వరప్రసాద్, నాయకులు కార్తీక్ జయంత్, సింహాద్రి, సూర్య, ఢిల్లీ, సిఆర్‌పీలు విక్కీ, షణుగ్మం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చంద్రబాబునాయుడు పర్యటన విజయవంతం చేయండి

శాంతీపురం,జూన్ 24 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం పర్యటనను విజయవంతం చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడువిశ్వనాథ్ నాయుడు కోరారు,సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సియం పర్యటనపై పార్టీ నేతలతో చర్చించారు,మంగళవారం సియం చంద్రబాబు నాయుడు,మండలంలోని జల్లిగానిపల్లి,చిన్నారిదొడ్డి గ్రామాల్లో హంద్రీనీవా కాలువ పనులు పరిశీలిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నేతలు జనార్ధన్‌రెడ్డి,ఉదయ్‌కుమార్,శివ,చంద్ర,గోపాల తదితరులు పాల్గొన్నారు.

## నారాలోకేష్‌ను కలసిన ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, జూన్ 24 ప్రభాతవార్త



రాష్ట్ర విద్యాశాఖ, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌ను సోమవారం ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం సచివాలయంలో మంత్రి నారా లోకేష్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ మంత్రి లోకేష్‌ను కలసి ఘనంగా సత్కరించారు. కుప్పం ప్రాంతంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై మంత్రి లోకేష్‌కు వివరించారు.

## సర్పంచ్ చేతులు మీదుగా విద్యా కిట్లు పంపిణీ

పాకాల, జూన్ 24, ప్రభాతవార్త :పాకాల మండలం అచ్చమ్మ అగ్రహారం ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అందజేసిన విద్యా కిట్లను, హెచ్‌ఎం అనగల్లు జార్జి, ఉపాధ్యాయుల సమక్షంలో ప్రస్తుత గ్రామ పంచాయితీ సర్పంచ్ పొలకల చెంగలరాయులు చేతుల మీదుగా విద్యార్థులకు బ్యాగులు, పెన్నులు, పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేశారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటు

సదుం, జూన్ 24 ప్రభాతవార్త

మండల పరిదిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటుచేయనున్నట్లు ట్రాన్స్‌కో డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ కె.నరేంద్ర తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రబుత్వాలు సంయుక్తంగా ఈపథకంలో పాలు పంచుకోవాలని సూచించారు. ఇందుకోసం తొలుతా అన్ని మండల స్థాయి కార్యాలయాలు, ఉన్నతపాఠశాలలు, రైతుభరోసా కేంద్రాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలలో ఈ సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసి సోలార్ విద్యుత్‌ను అందించనున్నామన్నారు. ఇందుకోసం ప్రభుత్వ కార్యాలయాలపై కొలతలను సోమవారం సేకరించారు..

## మంత్రి సత్యకుమార్‌ను కలసిన యాదవనాయకులు



పుంగనూరు,జూన్ 24 ప్రభాతవార్త :

ఉమ్మడి చిత్తూరుజిల్లాకు చెందిన యాదవసంఘ నాయకులు రాష్ట్రవైద్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను సోమవారం సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. యాదవ సంఘ నాయకుడు గుర్రంరెడ్డెప్పయాదవ్ సారధ్యంలో మంత్రిని కలసిన నాయకులు తమ నియోజకవర్గాలకు పర్యటనకు రావాల్సిందిగా ఆహ్వానించారు. ముఖ్యంగా పుంగనూరు నియోజకవర్గానికి వస్తానని మంత్రి రెడ్డెప్పయాదవ్‌తో స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ నుంచినే విద్యార్థులకు వైద్యవిద్యలను మరింతగా పెంచాలన్నారు. ఏఎన్‌ఎం,ఎక్స్‌రే,లాబ్‌టెక్నీషియన్,ఎంపిహెచ్‌డబ్ల్యూ వంటి కోర్సులను దాదాపు అన్ని ఇంటర్ కళాశాలలో ప్రత్యేక కోర్సులుగా ప్రవేశపెట్టాలని రెడ్డెప్పయాదవ్ సూచించారు.ఈవిషయాన్ని పరిగణలోనికి తీసుకుంటానని మంత్రి స్పష్టంచేశారు.

## దోమల కట్టడికి పక్కాగా చర్యలు

పాలసముద్రం, జూన్ 24 ప్రభాతవార్త:

మలేరియా, డయేరియా జ్వరాలను కట్టడి చేయడానికి దోమలు ఉత్పత్తి కాకుండా చేయడానికి పక్కాగా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓ రామనాథరెడ్డి అన్నారు. వెలుగు కార్యాలయంలో సోమవారం వైద్య ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లకు ప్రత్యేక సమావేశం జరిగింది. ఎంపిడిఓ రామనాథరెడ్డి మాట్లాడుతూ చిన్న పిల్లల ప్రాణాలను తీయడంలో అతిసారా వ్యాధి అగ్రస్థానంలో వుందన్నారు. కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల అతిసారా వ్యాప్తి ప్రబలుతుందని దీనిని కట్టడి చేయడానికి సిద్ధంగా వుండాలన్నారు. ఎక్కడైనా పైపు లీకేజీ కన్పిస్తే సత్వరం సరి చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో తహసిల్దారు సుబ్బలక్ష్మీ, సిహెచ్‌ఓ జ్ఞానశేఖర్, ఇఓఆర్డీ రమేష్, ఎంఇఓ రాజేంద్రప్రసాద్, ఎఎస్ఐ చక్రవర్తి, పిహెచ్‌సి ఇన్‌ఛార్జీ డాక్టర్ మురళీ, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు నిత్యం అందుబాటులో ఆరోగ్య సిబ్బంది

### - పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ శివప్రకాష్‌రాజు

పాలసముద్రం, జూన్ 24 ప్రభాతవార్త:

వ్యాధుల సీజన్ ప్రారంభం కావడంతో వైద్య సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో వుండాలని పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ శివప్రకాష్‌రాజు అన్నారు. ఎంపిడిఓ కార్యాలయంలో సోమవారం ఎంపిడిఓ రామనాథరెడ్డితో కలిసి డాక్టర్లు, ఎఎన్‌ఎంలతో పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మాట్లాడుతూ వ్యాధుల సీజన్ ప్రారంభం కావడంతో ప్రజల ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన చర్యలను వైద్య సిబ్బంది క్షేత్ర స్థాయిలో పక్కాగా వివరించాలని కోరారు. జిల్లాలో పలు చోట్ల ప్రస్తుతం అతిసార కేసులు నమోదు అవుతున్నాయని పాలసముద్రం మండల పరిధిలో ఇలాంటి కేసులు నమోదు కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంతో వైద్య సిబ్బంది విఫలం అయితే వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

పాకాల, జూన్ 24, ప్రభాతవార్త

పాకల ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయానికి విశ్రాంత ప్రధానాచార్యులు డా. దామోదర్ నాయుడు పుస్తకాలను విరాళంగా అందజేశారు. ఈ పుస్తకాలను కళాశాల ప్రధానాచార్యులు ఏ. మొహిద్దీన్ భాషాకు అందజేసారు. ప్రధానాచార్యులు మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగకరమైన పుస్తకాలను కళాశాల మొదటి ప్రిన్సిపాల్‌గా పనిచేసిన డా. దామోదర్ నాయుడు గ్రంథాలయానికి ఇవ్వడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. అధ్యాపకులు మోహన్ బెహరా, ఈశ్వర బాబు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## జక్కం రెడ్డి సేవలు స్ఫూర్తిదాయకం

### లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్‌చే బిటెక్ విద్యార్థి వైద్యం కోసం రూ. 40 వేలు అందజేత



గూడూరు, జూన్ 24, ప్రభాతవార్త

సీనియర్ లయన్ జక్కంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి సేవలు స్ఫూర్తిదాయకమని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్ అన్నారు. సోమవారం గూడూరు డిఎస్‌ఆర్ కమ్యూనిటీ ఆడిటోరియంలో బిటెక్ విద్యార్థి వైద్య ఖర్చులకు లయన్స్ క్లబ్ సభ్యులతో కలిసి 40 వేల రూపాయిలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఓజిలి మండలం పెద్దపరియ గ్రామానికి చెందిన బిటెక్ విద్యార్థి బుస్సారెడ్డి రేవంత్ రెడ్డి ప్రమాదవశాత్తు చెట్టుపై నుండి పడిపోయాడన్నారు. దీంతో వెన్నుముక దెబ్బతిందన్నారు. పేద విద్యార్థి వైద్యం కోసం లయన్స్ క్లబ్ తరపున 20 వేలు, సీనియర్ లయన్ జక్కం రెడ్డి శ్రీనివాసులు రెడ్డి 20 వేల దాతృత్వం కలిపి 40 వేల రూపాయలను రేవంత్ రెడ్డి తండ్రి శ్రీనివాసులు రెడ్డికి అందించామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు మదనమేటి రమణయ్య, కల్యాన్ సాయి, రూపేష్ రెడ్డి, వీరేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాన్ని పరిశీలించిన డిఎంహెచ్‌ఓ

గూడూరు, జూన్ 24, ప్రభాతవార్త



గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరులో ఉన్న గిరిజన గురుకుల పాఠశాలను తిరుపతి డిఎంహెచ్‌ఓ శ్రీహరి పరిశీలించారు. ఇటీవల గురుకుల పాఠశాలలో కలుషిత నీరు త్రాగి 8 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న డిఎం హెచ్‌వో పాఠశాలను పరిశీలించారు. జరిగిన సంఘటనపై ప్రిన్సిపాల్ మధుసూధన్‌తో మాట్లాడారు. అనంతరం చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. పాఠశాలలోని స్టార్ రూమ్‌లో ఉన్న సామగ్రిని పరిశీలించారు.

## మొదటిరోజు అర్జీలు నిల్

కోట, జూన్ 24 ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కోటలో సోమవారం జరిగింది. అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించడానికి సిద్ధమయ్యారు. అయితే మండల ప్రజల నుంచి అర్జీలు రాలేదని తహశీల్దార్ నాగరాజన్ తెలిపారు.

## డివిసత్రంలో ఇసుక మాఫియా ...

### పట్టించుకోని పోలీసులు ...

దొరవారిసత్రం జూన్ 24 ప్రభాతవార్త ;

దొరవారిసత్రం మండలంలోని వెదురుపట్టు,మోదుగులపాళెం,వేటగిరిపాళెం,తనియాలి,భూదూరు గ్రామాల సమీపంలో ఉన్న కాళంగినది నుండి కొంతమంది అక్రమార్కులు రాత్రిసమయంలో ఇసుక మాపియాకు పాల్పడుతున్న సంబందిత పోలీసులు పట్టించుకోవడంలేదని ఆయాగ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.సూళ్ళూరుపేట-పెళ్ళకూరు ప్రాంతాల్లో ఉన్న కంపెనిలకు ఇసుక మంచి గిరాకి ఉండటం ఒకట్రాక్టర్ ఇసుక 4000నుండి5000వరకు పలుకుతుండటంతో అక్రమార్కులు ముట్టాగా ఏర్పడి ఇసుక మాపియాకు పాల్పడుతున్నారు.కొంతమంది అక్రమార్కులు ప్రభుత్వ నిభంధనలకు విరుద్దంగా రాత్రిసమయంలో కాళంగినదిలో ఇసుకను తవ్వేయడం వల్లన భూగర్బజలాలు అడుగండిపోయి వ్యవసాయబోర్లుకు నీరందక అవస్థలు పడుతున్నామని ఆయాగ్రామాల రైతులు వాపోతున్నారు.ఇసుక మాపియాను అరికట్టాలని స్థానిక పోలీసులకు పలుదపాలుగా పిర్యాదుచేసిన పట్టించుకోకుండ నెలసరి మామ్ముళ్ళతో సరిపెట్టుకుంటున్నారని వారుఆరోపిస్తున్నారు.ఇప్పటికైనా జిల్లాఉన్నతాదికారులు స్పందించి ఇసుక మాపియాకు పాల్పడుతున్న అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## రైతులకు మేలు చేసేది తెలుగుదేశం ప్రభుత్వమే

### ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



వెంకటగిరి, జూన్ 24, ప్రభాతవార్త

రైతులకు ఎంతగానో ఉపయోగపడే అల్తూరుపాడు రిజర్వాయర్ పనులను రెండు సంవత్సరాల కాలంలో పూర్తి చేస్తానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరిలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆయన రైతులకు సగం ధరలకే పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. రైతులకు సాగునీరు అందించే అల్తూరుపాడు ప్రజెక్టు పనులను గత ప్రభుత్వం ఆపివేయించినట్లు తెలిపారు. తాను ఈ పనులను ప్రారంభించాలని అయితే ప్రభుత్వం మారడంతో ఆపి వేయించినట్లు తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం రైతుల పక్షపాతం ప్రభుత్వమని తెలిపారు. రైతులకు ఎప్పుడు టిడిపి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. సమావేశంలో ఎంపిపి తనుజ రెడ్డి, ఏడిఏ నాగార్జున సాగర్, ఏవో సుజాత, శిరీష, మాజీ జడ్పిటిసి రామచంద్ర నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు చంద్రమౌళి రెడ్డి, కోటేశ్వర్ రెడ్డి, గంగాధర్, రామచంద్రయ్య, మండల పరిషత్ ఉపాధ్యక్షులు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రవేట్ విద్య కంటే ప్రభుత్వ విద్య మేలు

వెంకటగిరి జూన్ 24ప్రభాతవార్త:

పట్టణ,గ్రామీణ ప్రాంతాలల్లోని విద్యార్థులు తల్లితండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రవేట్ పాఠశాలల్లో అర్హులైన అధ్యాపక సిబ్బంది సక్రమంగా లేకపోవడంతోపాటు అధీక మోతాదులో ఫీజులు బారం తప్ప మేరుగైన విద్యావిధానం లేదని సింహపూరి యూత్ అసోసియన్ అధ్యక్షుడు గుడిమిట్ల ఉదయ్‌కుమార్ అన్నారు. అదివారం విలేఖర్ల సమావేశంలో మాట్లడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పోరేట్ పాఠశాలల కంటే మేరుగైన విద్యను అందిస్తున్నారని తెలిపారు. వెంకటగిరి, డక్కిలి,బాలాయపల్లి మండాలల్లో గ్రామీణ ప్రాంతాలల్లో పేదలకు మెరుగైన వైద్యా సేవలు కోసం మోగా మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు ప్రవీణ్,నిఖేష్,సురేష్ తదితరులు ఉన్నారు.

## వాసవీ క్లబ్‌చే పలు సేవా కార్యక్రమాలు



సూళ్లూరుపేట, జూన్ 24 ప్రభాతవార్త

సూళ్లూరుపేటలోని వాసవి, వనితా క్లబ్ ఆధ్వర్యంలో డాన్‌టు డస్ట్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీకన్యకా పరమేశ్వరిదేవికి చీర, సాంప్రదాయబద్ధమైన సారెను సమర్పించారు. కానిస్టేబుళ్లకు మార్కులు, టర్కీ టవళ్లు, అవయవదానం చేసిన ఇద్దరు క్లబ్ సభ్యులకు దర ఖాస్తు పత్రాలు, పదిమంది వీధి వ్యాపారులకు ఎండకు తట్టుకునే విధంగా గొడుగులు అందజేశారు. ఇద్దరికి నాలుగు చక్రాల బండ్లు, 50 మంది విద్యార్థులకు కిట్లు, నూతనంగా పదిమంది సభ్యులను క్లబ్‌లో చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వాసవీ వనితా క్లబ్‌కు చెందిన సాయిరామ్, శ్రీనివాసరావు, సునీత, అభిషేక్, ధనుష్‌కుమార్, శ్యాంసుందర్, దుర్గి రమేష్, నూతలపాటి శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, కె.శ్రీరామమూర్తి, నిర్మలకుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌చార్జి ఎంపిడిఓగా ఉమామహేశ్వరరావు

వాకాడు, జూన్ 24, ప్రభాతవార్త

వాకాడు మండల ప్రజా పరిషత్ ఇన్చార్జి ఎంపిడిఓగా వాకాడు పంచాయితీ కార్యదర్శి ఉమామహేశ్వర రావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఉన్న ఎంపిడిఓ ఐ వెంకటేశ్వర రావు రెండు రోజుల పాటు సెలవు పై వెళ్తుండడంతో 25,26వ తేదీల్లో రెండు రోజుల పాటు ఉమామహేశ్వర రావు ఇన్చార్జి ఎంపిడిఓగా కొనసాగుతారని ఉన్నత స్థాయి అధికారికంగా ఆఫీస్ సిబ్బంది తెలిపారు.

## ప్రి స్కూల్ పిల్లలకు పోషక విలువలుతో కూడిన ఆహారం-సిడిపిఓ

వెంకటగిరి జూన్ 24 ప్రభాతవార్త:

వెంకటగిరి ఐసిడిఎస్ ప్రాజెక్టు కేంద్రంలో పరిధిలోని వెంకటగిరి,డక్కిలి,బాలాయపల్లి మండలాల్లో మొత్తం 244 అంగన్‌వాడి కేంద్రాలు ఉన్నాయని అదేవిదంగా 17 మిని అంగన్‌వాడి సెంటర్లు ఉన్నయని జూలై 1 నుంచి 3 సంవత్సరాలు లోపు నుంచి 6 సంవత్సరాలు లోపు ప్రి స్కూల్ పిల్లలకు అంగన్‌వాడి సెంటర్‌లల్లో కిచిడి,హల్వా,ఉప్మాకు బదులుగా న్యూ పుడ్ మోడల్ పధకం ద్వారా పిల్లలకు పోషక విలువలతో కూడిన భోజనం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందినట్లు సిడిపిఓ ఎస్‌కె సంషాద్‌బేగం తెలియజేశారు. కార్యలయంలో ఏర్పాటు చేసి సెక్టర్ సమావేశంలో అంగన్‌వాడి కార్యకర్తలతో మాట్లడుతూ ప్రాజెక్టు పరిధిలో 4686 మంది పిల్లలు ఉన్నట్లు తెలిపారు.

## ఘనంగా అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ దినోత్సవం

కోట,జూన్ 24 ప్రభాతవార్త

కోట మండలం విద్యానగర్‌లోని అంర్జాతీయ హ్యాండ్ బాల్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా క్రీడాకారులు కేక్ కట్ చేసి సంబంరాలు చేసుకున్నారు. మండల హ్యాండ్ బాల్ సంఘం అధ్యక్షులు రవి కుమార్ ముఖ్య అతిధిగా హజరై మాట్లాడారు. ఈ ఆటను మరింత ప్రాచుర్యంకి తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఆయన క్రీడా కారులకు హ్యాండ్ బాల్‌లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో క్రీడాకారులు ప్రతాప్, కృష్ణ, మురళి,తదిరులు పాల్గొన్నారు.

## జీవో 117 రద్దు చేయాలి

కోట,జూన్ 24 ప్రభాతవార్త

ప్రభుత్వ ప్రాథమిక విద్య నిర్వీర్యానికి కారణమైన జీవో 117 ను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని మండల యూటిఎఫ్ అధ్యక్షులు ముప్వల మనోహార్ కోరారు. ఆయన సోమవారం కోటలో విలేకర్లతో మాట్లాడారు. ఉద్యోగులకు రావాల్సిన 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను వీలైనంత త్వరలో పరిష్కరించాలని పేర్కొన్నారు. రావాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఆయన వెంట పలువురు ఉపాధ్యాయులు ఉన్నారు.

## డయేరియాపై అవగాహన సదస్సు



వాకాడు, జూన్ 24, ప్రభాతవార్త

వాకాడు మండల పరిషత్ కార్యాలయం లోని స్త్రీ శక్తి భవనంలో సోమవారం ఎంపిడిఓ వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో డయేరియా కార్యక్రమం మండల స్థాయి అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ జిల్లా ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు మండలంలోని అన్ని పంచాయితీలలో వైద్య సిబ్బంది, డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలుషితమైన నీటి వలన, దోమల వలన, వీధులలో పైపులు లీకైన అన్ని చోట్ల అప్రమత్తంగా అధికారులు ఉండాలన్నారు. మండలంలోని డయేరియా సూచనలు ప్రజల వద్ద కనిపించిన వెంటనే వైద్య అధికారులు పంచాయితీ అధికారులు అప్రమతమై వైద్యం అందించి, ఆ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత పంచాయితీ అధికారులదని ఎంపిడిఓ సూచించారు. సమావేశంలో మండల స్థాయి అధికారులు, వైద్య అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలి

బాలాయపల్లి, జూన్ 24, ప్రభాతవార్త



అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో తహశీల్దార్ పుల్లారావు, ఎంపిడిఓ అరుణ, డాక్టర్ లిఖిత అధికారులు పాల్గొన్నారు. తాగు నీటి పైపులైన్లు లీక్ కాకుండా చూసుకోవాలని అధికారులను ఎంపిడిఓ అరుణ ఆదేశించారు. వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలని సూచించారు. తాగునీటి పైపు లైను లీకై నీరు కలుషితమైతే డయేరియా వంటి వ్యాధులు ప్రబలుతాయని తహశీల్దార్ పుల్లారావు తెలిపారు. వ్యాధులు ప్రబలకుండా అందరూ అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ లిఖిత తెలిపారు. ఇంకా పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రేణుక సాయి, ఈఓపిఆర్డి శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పుచ్చలపల్లి సుందరయ్య కాలనీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

### సిపిఎం నాయకులు జోగిశివకుమార్

గూడూరు, జూన్ 24, ప్రభాతవార్త

గూడూరు పట్టణంలో ఉన్న పుచ్చలపల్లి సుందరయ్య కాలనీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పుట్ట శంకరయ్య ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌ని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ మాట్లాడుతూ సుందరయ్య కాలనీలో గత కొంత కాలం నుండి వర్షం వచ్చినప్పుడల్లా కాలనీలో ఉన్న సగానికి పైగా ఇల్లులోకి నీళ్లు వచ్చేస్తున్నాయని దీని వలన స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. త్రాగడానికి నీరు కూడా లేదని సుమారు నాలుగు బోర్లు రిపేర్‌లో ఉన్నాయని తక్షణమే రిపేర్ చేయాలని తెలిపారు. రోడ్ల మీద ఉన్న వీధి లైట్లు సగానికి పైగా పనిచేయటం లేదని వెంటనే వీధి దీపాలను పునరుద్దరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు శ్రీనివాసులు, సురేష్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## గ్రీవెన్స్‌డేలో ప్రజల నుంచి వినతులు



శ్రీకాళహస్తి/తొట్టంబేడు, జూలై 24 ప్రభాతవార్త : ప్రతి సోమవారం ప్రభుత్వ కార్యాలయాల్లో గ్రీవెన్స్‌డేను నిర్వహించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం గ్రీవెన్స్‌డేను నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో తొట్టంబేడు తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శివరామ సుబ్బయ్య, ఎంపిడిఓ ఐజాక్ ప్రవీణ్ అధికారులు కలసి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. మొత్తం 7 వినతిపత్రాలు వచ్చాయని వీటిని పరిష్కరించేందుకు చర్యలుతీసుకోవాలని విఆర్‌ఓలను ఆదేశించామన్నారు. పట్టాదారు పాసుపుస్తకాల్లో మార్పులు, ఇతర సమస్యలపై వినతిపత్రాలు వచ్చినట్లు తెలిపారు. కాగా శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ జనార్ధన్‌రాజు, ఆర్డీవో కార్యాలయంలో ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈసందర్భంగా తొట్టంబేడు తహశీల్దార్ శివరామ సుబ్బయ్య మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిష్కరించేందుకు చర్యలుతీసుకుంటామని వివరించారు.

## ముఖ్యమంత్రి పథకాలతోనే రాష్ట్రంలో సంక్షేమం



శ్రీకాళహస్తి, జూన్ 24 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతోనే రాష్ట్ర ప్రజలు సంక్షేమం, సంతోషంగా ఉంటారని తెలుగుదేశంపార్టీ యువత నాయకులు వంకాయల సిద్దులయ్య తెలిపారు. సిఎం చంద్రబాబు సంతకాలు చేసిన ఐదు హామీలకు ఏపి మంత్రి వర్గం ఆమోదం తెలపడం హర్షణీయం అన్నారు. తొలుత నిరుద్యోగుల కోసం మెగా డిఎస్సీ ద్వారా 16,347 పోస్టుభర్తీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌రద్దు, రూ.4వేలకు పెన్షన్ పెంపు, నిరుపేదలు, చిరు వ్యాపారుల కోసం అన్న క్యాంటీన్ల పునరుద్దరణ, నైపుణ్య గణన(స్కిల్ డెవలప్‌మెంట్), విజయవాడ ల్లోని వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు ఎన్టీఆర్ యూనివర్సిటీగా మార్పునకు కేబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయం అన్నారు. అలాగే శ్రీకాళహస్తిలో కూడా ఎంఎల్ఏ బొజ్జలసుధీర్‌రెడ్డి సారథ్యంలో త్వరలోనే అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని కోరారు.

## సామాజిక విలువలతో కూడిన చదవే... సమాజాభివృద్ధికి మూలం

**-టిడిపి ప్రచార కార్యదర్శి దొడ్ల కరుణాకర్‌రెడ్డి**



తిరుపతిరూరల్, జూన్ 24 ప్రభాతవార్త: సామాజిక విలువలతో కూడిన చదువే... సమాజాభివృద్ధికి భీజం వేస్తుందని, ఉపాధ్యాయులు పిల్లలకు విలువలతో కూడిన విద్యను అందించాలని టిడిపి జిల్లా ప్రచార కార్యదర్శి దొడ్ల కరుణాకర్‌రెడ్డి సూచించారు. తుమ్మల గుంట గ్రామ పంచాయతి పరిధిలోని ఉప్పరపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం దొడ్ల కరుణాకర్‌రెడ్డి పాఠ్య పుస్తకాలను పంపిణి చేసారు. విద్యార్థులకు స్వీట్స్, చాక్లెట్స్ పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు జన్మనిస్తే...పిల్లలకు విద్యా బుద్దులతో పాటు క్రమశిక్షణను, సామాజిక విలువలను ఒంటబట్టించి, సమగ్ర వ్యక్తిత్వం కలిగిన మనిషిగా తీర్చిదిద్దడంలో గురువు పాత్ర అసమానమైనదన్నారు. అందుకే మాతృదేవోభవ, పితృ దేవోభవ, ఆచార దేవోభవ అని అంటారని తెలిపారు. విద్యార్థులు బాల్యం నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. విద్యార్థుల చదువుకోసం ఎలాంటి సాయం అందించటానికి సిద్దంగా ఉన్నానని తెలిపారు. అనంతరం దొడ్ల కరుణను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చెంగల్ రామానాయుడు, శ్రీనివాసులు రాయల్, పార్లపల్లి భరత్‌కుమార్‌రెడ్డి, అయ్యప్ప, పంచాయతి కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు చెంచుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## స్విమ్స్ బ్లడ్ బ్యాంకుచే రక్తదాన శిబిరం



తిరుపతి హెల్త్, జూన్ 24 ప్రభాతవార్త : శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ బ్లడ్ బ్యాంక్ విభాగం ఆధ్వర్యంలో శ్రీరామ్ ఫైనాన్స్ రేణిగుంట రోడ్డు తిరుపతి నందు సోమవారం స్వచ్ఛంద రక్తదాన శిభిరంను విజయవంతం నిర్వహించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలిపారు. శ్రీరామ్ ఫైనాన్స్, రేణిగుంట రోడ్డు, తిరుపతి నిర్వాహకులు రక్తదాన శిభిరంను నిర్వహించుటకు అంగీకరించిన స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్‌వి కుమార్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్వచ్ఛంద రక్తదాన శిభిరాన్ని స్విమ్స్ బ్లడ్ బ్యాంక్ విభాగాధిపతి డా. శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. బ్లడ్ బ్యాంక్ వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పాల్గొని 53 మందికి బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలు, నిర్వహించగా 41 మంది వ్యక్తులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డా. సురేష్ బాబు, డా. రవికాంత్, నర్సింగ్ స్టాఫ్ కె. రామాదేవి, చంద్రకళ, ఎంఎస్‌డబ్ల్యూ తదితరులు పాల్గొన్నారు.

**గత ప్రభుత్వం సొంత పార్టీ కార్యాలయాలకు**

## కోట్లాది రూపాయలు ప్రజాధనాన్ని కొల్లగొట్టారు

**టిడిపి నాయకులు నరసింహ యాదవ్, ఊక విజయ్ కుమార్‌లు**



తిరుపతి హెల్త్, జూన్ 24 ప్రభాతవార్త : గత వైసిపి ప్రభుత్వం తమ సొంత పార్టీ కార్యాలయాలకు కోట్లాది రూపాయిలు ప్రజాధనాన్ని కొల్లగొట్టి భారీ స్థాయిలో కట్టడాలు నిర్మించుకున్నారని అలాగే ఋషికొండలో సుమారు 500 కోట్ల రూపాయిలతో ప్రజాధనం వెచ్చించి అదే తరహాలో నిర్మాణాలు చేపట్టారని ఆరోపిస్తూ తిరుపతికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు నరసింహ యాదవ్ ఊక విజయ్ కుమార్‌లు ధ్వజమెత్తారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఉదయం జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తిరుపతికి సమీపంలోని ఏర్పేడు వద్ద భారీ స్థాయిలో పెద్ద నిర్మాణాలు చేపట్టారని దీనిపై ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి మూలాలు రాంకో సంస్థ నుంచి వేల కోట్ల రూపాయిలు వైసిపి వారు ముడుపులు దండుకున్నారని ఆరోపించారు. చంద్రగిరి నియోజకవర్గంలో కూడా భాస్కర్ రెడ్డి పార్టీ కార్యాలయం సంబంధించిన స్థలాన్ని కూడా సేకరించినట్లు తెలిపారు. తిరుపతిలో నిర్మించిన 14 మాస్టర్ ప్లాన్ రోడ్ల వెనుక జరిగిన తథంగాలన్నీ వెలికితీస్తామని, మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణంలో తమ స్థలాలు పోగొట్టుకున్న వారికి న్యాయం చేస్తామని వారు హామీ ఇచ్చారు. విలేకరఉల సమావేశంలో తెలుగుదేశం నాయకులు చేజర్ల మనోహరాచారి, ఓట్ల సురేందర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కబ్జాదారుల నుంచి మా ఇంటిని కాపాడండి

తిరుపతి హెల్త్, జూన్ 24 ప్రభాతవార్త : సుమారు 40 సంవత్సరాలుగా నివాసముంటూ మున్సిపల్ కార్యాలయానికి అన్ని రకాల పన్నులు చెల్లిస్తూ ఉన్నామని బాధితులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తిరుపతిలోని సంజయ్ గాంధీ, కాలనీలోని 2-5-746/3 నెంబర్ గల ఇంటిలో తమ కుటుంబం జీవనం సాగిస్తున్నామని వారు తెలియజేశారు. ఇంటి, నీటి తదితర మున్సిపల్ పన్నులు చెల్లిస్తున్నామని తెలిపారు. కాగా 1991లో యాలమూరి శ్రీనివాసులు రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి అనే వ్యక్తులు తమపై దౌర్జన్యం చేసి మా స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించారని వారు పేర్కొన్నారు. అయితే 1996 సంవత్సరంలో తమ వైపు కోర్టు తీర్పు ఇచ్చిందని వారు స్పష్టం చేశారు. అనంతరం 2000 సంవత్సరంలో టి. రాజేశ్వరి తమ ఇంటి స్థలాన్ని ఆక్రమించుకునేందుకు తప్పుడు పత్రాలతో కోర్టుకు వెళ్ళగా తమ వైపు తీర్పు వచ్చిందని తెలిపారు. తమ పూరి గుడిసెను రేకులతో మరమత్తు చేసుకునే సమయంలో టి. గోపికృష్ణ అనే వ్యక్తి తమ పై దౌర్జన్యం చేస్తూ దాడులకు పాల్పడుతున్నాడని భయాన్ని వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పికి ఫిర్యాదు చేస్తే సిఐకు ఆదేశాలు జారీ చేశారని నిమ్మకు నీరెత్తినట్లు సిఐ వ్యవహరిస్తున్నారని వారు విమర్శించారు. పోలీసు, ఉన్నత స్థాయి అధికారులు రెవెన్యూ అధికారులు స్పందించి, తమకు న్యాయం చేకూర్చాలని విన్నవించుకున్నారు. సమావేశంలో బాధితుల కుటుంబ సభ్యులు వెంకట సుబ్బమ్మ, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా నాయకుడిని పరామర్శ



తొట్టంబేడు, జూన్ 24 ప్రభాతవార్త : పిల్లమేడు గ్రామ హరిజనవాడకు చెందని తెలుగుయువత నాయకుడు మెరిమి సురేష్‌ను మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు పరామర్శించారు. ఇటీవల సురేష్ మోటార్ సైకిల్‌లో వెళ్తుండగా ప్రమాదానికి గురై తలకు బలమైన గాయం కావడంతో శ్రీకాళహస్తిలోని ఏరియా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం తిరుపతిలోని రమాదేవి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆర్థిక ఇబ్బందుల వల్ల అక్కడ నుంచి బర్డ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సురేష్‌ను పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు పరామర్శించి శాసనసభ్యులు బొజ్జలసుధీర్‌రెడ్డితో మాట్లాడి కుటుంబానికి న్యాయం చేస్తామని భరోసా కల్పించారు. పరామర్శించిన వారిలో యువనాయకులు కస్తూరయ్య, విజయకుమార్, మోనీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయండి : ఎమ్మెల్యే పులివర్తి



చంద్రగిరి, జూన్ 24 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని ఎంఎల్ఏ పులివర్తి నాని అధికారులతో అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన మొదటిసారి ఎంఎల్ఏ హోదాలో "మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేధిక" కార్యక్రమాన్ని ఏర్పాటుచేసి ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటముని చంద్రగిరి-రేణిగుంట ఆర్టీసి టౌన్ సర్వీసులను పురుద్ధరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఏళ్ళ తరబడి టౌన్ సర్వీసులను నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. దీనిపై స్పందించిన ఆయన ఆర్టీసి అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా ప్రజలు విద్యుత్-1, ఆర్అండ్‌బి -1, పెన్షన్ (ఎంపిడిఓ) -11, రెవెన్యూ (ఎంఆర్ఓ)-33, విద్య (ఎంఈఓ)-1, ఏపిఎస్ఆర్‌టిసి(ప్రజా రవాణా)-2, ప్రత్యేక ప్రతిభావంతుల సంక్షేమం-1, పంచాయతీ రాజ్(ఏఈ)-4, వ్యవసాయం (ఏఓ)-1, గ్రామీణ మంచినీటి సరఫరా (ఆర్‌డబ్ల్యుయస్)-4, గ్రామ పంచాయతీలు (ఈఓ పిఆర్అండ్ఆర్‌డి) -8, పశుసంవర్ధకశాఖ (వెటర్నరీ)-1 మొత్తం 68 వినతులు అందించి తమ సమస్యలను పరిష్కరించాలని ఎంఎల్ఏని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశిస్తూ ఆయా విభాగాల అధికారులకు ప్రజల వినతులను అందజేశారు. అనంతరం అధికారులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన వినతులను రికార్డు చేసుకుని రశీదులు ఇవ్వాలను ఆదేశించారు. భాధితుల సమస్యల పరిష్కారానికి క్షేత్ర స్థాయి పరిశీలించి మీరు తీసుకునే చర్యలను ఫిర్యాదీదారులకు అందజేయా లన్నారు. ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రారంభమైనందున విద్యార్థులకు సర్టిఫికెట్ల మంజూరు విషయంలో జాప్యం లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన దరఖాస్తుదారులకు మంజూరు చేయాలని అన్నారు. ప్రభుత్వ భూములు, స్థలాలు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే సహించవద్దని తేల్చిచెప్పారు. నిరుపయోగంగా వున్న ఆర్టీసి బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావడంతో పాటు చంద్రగిరి-రేణిగుంట టౌన్ సర్వీసులను పునరుద్ధరించాలని కోరారు. చంద్రగిరిలో గంజాయి, డ్రగ్స్‌ను పూర్తిగా అరికట్టాలని బాధిత తల్లిదండ్రులు ఎంఎల్ఏని కోరారు. దీనిపై స్పందించిన ఆయన రాష్ట్ర వ్యాప్తంగా గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలను పూర్తి స్థాయిలో నియంత్రించడానికి కృతనిశ్చయంతో వున్నందున ప్రభుత్వం మంత్రి వర్గంలో చర్చించి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. చంద్రగిరిలో గంజాయి విక్రయాలపై సమగ్ర సమాచారాన్ని ఆధారాలు అందిస్తానని చర్యలు తీసుకోవాలని ఎస్ఐ అనితను ఆదేశించారు. చంద్రగిరి నియోజకవర్గంలో గంజాయి, డ్రగ్స్‌కు చోటులేదని తేల్చిచెప్పిన ఆయన స్మగ్లర్లు తస్మాత్ జాగ్రత్త అంటూ హెచ్చరికలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి, తహశీల్దార్ మారుతి, ఎంపిడిఓ డాక్టర్ వి.వి.సూర్యసాయి, నాయకులు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, కొండూరు ప్రవీణ్ రాయల్, ఏజి పల్లి బాల, పులికంటి మోహన్‌రెడ్డి, సక్కూర్ ధనంజయ రెడ్డి, శానంబట్ల తులసిరెడ్డి, రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, గౌస్‌భాషా, మండలం లోకేష్ రాయల్, రవితేజ, లీలాకృష్ణ, మండల స్థాయి అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేద్దాం : ఎసిబి సిఐ



నారాయణవనం, జూన్ 24 ప్రభాతవార్త : డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరు సహకరించాలని పుత్తూరు ఎస్ఇబి సిఐ ఉరుకుందమ్మ తెలిపారు. స్థానిక సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వాడకం వల్ల జరిగే అనార్థంపై అవగాహన కార్యక్రమం ఆడిటోరియంలో జరిగింది. మాదక ద్రవ్యాలను వాడడం వల్ల జీవితాలు పాడవుతుందని గుర్తు చేశారు. విద్యార్థి దశలో విద్యార్థులు అవగాహన కలిగిన తల్లితండ్రులతో పాటు ఇతరులకు కూడా డ్రగ్స్ వాడకం వల్ల అనార్థంను వివరించాలన్నారు. కార్యక్రమంలో సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, జనార్ధన్‌రాజు, రమేష్, ఎస్ఇబి ఎస్ఐ రమణరాజు, స్థానిక ఎస్ఐ లక్ష్మీనారాయణ, ఎఎస్ఐ జయరాంనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

## రాస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

పుత్తూరురూరల్, జూన్ 24 ప్రభాతవార్త: రాష్ట్రీయ సేవాసమితి(రాస్) మహిళా పొదుపు సంఘాల సభ్యుల సౌకర్యార్థం రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, డైరెక్టర్ నాగరాజు ఆదేశాల మేరకు సోమవారం పుత్తూరులో రాస్ వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. టాటా ట్రస్టు ఆస్పత్రి(తిరుపతి శ్రీకర్) ఆధ్వర్యంలో బీపీ, షుగర్, హైపటైటిస్, నోరు, రొమ్ము, గర్భ సంచి వంటి ఆరోగ్య సమస్యలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అంతకు ముందు క్యాన్సర్ పట్ల మహిళలకు అవగాహన కల్పించారు. టాటా ట్రస్టు కో-ఆర్డినేటర్ హేమంత్, టాటా ట్రస్టు డా.వెంకటయ్య పాల్గొన్నారు. సుమారు 150 మంది మహిళలు, పురుషులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డా. వెంకయ్యబాబు, డా.మెహతాజ్,రెడ్డి కుమారి, రాస్‌సిబ్బంది ప్రకాష్,కనకపల్లి, సభ్యులు పాల్గొన్నారు.

## మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

సత్యవేడు, జూన్ 24 ప్రభాతవార్త: చిత్తూరు జిల్లాలో మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి జనార్ధన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైతులను ప్రభుత్వం ప్రోత్సహించి ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా మామిడి చెట్లు పెంపకానికి ఉచితంగా చెట్లు నాటిన ప్రభుత్వం నేడు కార్పొరేట్ కంపెనీలు దయాదక్షిణ్యాలపై రైతులు తమ పంటను అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వెలిబుచ్చారు. మార్కెట్‌లో మామిడి గుజ్జుతో తయారైన రసాలకు ఏ మాత్రం ధర తగ్గపోయినా కూడా రైతుల నుంచి సేకరించే మామిడి కాయల ధరను మాత్రం తగ్గించి డిమాండ్ లేదనే సాకుతో తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ రైతులను నష్టపరిచే విధంగా జూస్ పరిశ్రమ యాజమాన్యాలు రైతులను దోచేస్తుంటే ప్రభుత్వాలు తమకేమీ పట్టనట్లు ఉండడం సరికాదని జనార్ధన్ తెలిపారు.

## అతిసారా వ్యాధి నిర్మూలనపై అవగాహన

సత్యవేడు, జూన్ 24 ప్రభాతవార్త: సత్యవేడు మండలంలో అతిసారా వ్యాధి నిర్మూలనకు సంబంధించి అవగాహన క్యాంపుల నిర్వహణపై సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారుల సమన్వయ సమావేశం జరిగింది. దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి డా. మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన సమన్వయ సమయానికి తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీవో చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ అతిసారా వ్యాధి నిర్మూలన, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 30 వరకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఐడీసీపీ నిర్వహణ, అతిసారా వ్యాధి లక్షణాలు, హోటల్లో అపరిశుభ్రత, పరిసరాలు శుభ్రత తదితర అంశాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. ఈ సమన్వయ సమావేశంలో ఐసీడీఎస్ అధికారిని దేవకుమారి, ఎంఈవో రవి, ఆర్‌డబ్ల్యూసీ సచివాలయ ఏఈ భానుప్రకాష్, పంచాయతీరాజ్ ఏఈ దేవి ప్రసాద్, దాసుకుప్పం పీహెచ్‌సీ ఎంపీహెచ్‌వో సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి

**- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం**



సత్యవేడు, జూన్ 24 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. సత్యవేడు మండలంలో బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ లబ్ధిదారులకు పెంచిన మొత్తంతో కలిపి జూలై 1న రూ.7 వేలు పింఛన్ అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. పింఛన్ల లబ్ధిదారులకు చంద్రబాబు ఇచ్చిన మాట నెరవేర్చబోతున్నారని, రూ.వెయ్యి పెంచగా రూ.4 వేలు గత మూడు నెలల పెంపురూ.3 వేలు కలిపి రూ.7 వేలు పింఛన్ ఎన్టీఆర్ భరోసా పేరుతో జూలై 1న ఇంటి వద్దే అందించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీవో చంద్ర శేఖర్, ఎస్ఐ వీరాంజనేయులు, నాయకులు మాజీ ఎంపీపీ మస్తాన్, మాజీ మండల అధ్యక్షులు బాషా, ఎంపీటీసీ బి.బి.ఎస్.రెడ్డి, లోకయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేడుకగా క్రియా యూనివర్సిటీ స్నాతకోత్సవం



సత్యవేడు, జూన్ 24 ప్రభాతవార్త: శ్రీసిటీలోని క్రియా యూనివర్సిటీ స్నాతకోత్సవం 2024 కన్నుల పండుగగా నిర్వహించారు. కేంద్ర మాజీ ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ డాక్టర్ కె.విజయ రాఘవన్ ముఖ్య అతిథిగా పాల్గొని క్రియా విశ్వ విద్యాలయ యూజీ, పీజీ విద్యార్థులు, ఐఎఫ్ఎంఆర్ గ్రాడ్యుయేట్ బిజినెస్ స్కూలు రెండు, మూడు సంవత్సరాల ఎంబీఏ విద్యార్థులు, క్రియా, చెన్నై యూనివర్సిటీ పీహెచ్‌డీ విద్యార్థులు మొత్తం 350 మందికి డిగ్రీలు, అవార్డులు ప్రదానం చేశారు. దీంతో పాటు జెరూసలేంలోని హిబ్రూ యూనివర్సిటీలో హ్యూమనిస్టిక్ స్టడీస్ ప్రొఫెసర్ డేవిడ్ షుల్‌మాన్ రెనీ లాంగ్, ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సీఈవో డా. రుక్మిణి బెనర్జీలకు వారి వారి రంగాల్లో విశేషమైన సేవలకు గుర్తింపుగా గౌరవ డ్రాక్టరేట్‌లను ప్రదానం చేశారు. క్రియా యూనివర్సిటీ ఛాన్సలర్ లక్ష్మీనారాయణన్, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నిర్మలరావు, ఐఎఫ్ఎంఆర్ డీన్ ప్రొఫెసర్ నిర్మలరావు, ఐఎఫ్ఎంఆర్ డీన్ ప్రొఫెసర్ లక్ష్మీకుమార్, ఎస్ఐఏఎస్ అకడమిక్ డీన్ డాక్టర్ పృథ్వీ దత్తా చంద్రశోభి, రీసెర్చ్ విభాగం డీన్ ప్రొఫెసర్ శివకుమార్ శ్రీనివాసన్, ఇతర క్రియా అధికారుల సమక్షంలో పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా క్రియా విశ్వ విద్యాలయం వ్యవస్థాపక ఛాన్సలర్ ఎన్.వాఘుల్‌కు నివాళులర్పించిన వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నిర్మలరావు, ఆశాజనిక భవిష్యత్ కోసం వాఘుల్ నాయకత్వంలో క్రియా స్థాపించబడిందన్నారు. ఈ రోజు ఆయన లేకున్నా లక్ష్యం నెరవేరిందన్నారు. డాక్టర్ విజయరాఘవన్ పట్టభద్రులను ఉద్దేశించి మాట్లాడుతూ విభిన్న దృక్కోణాల విద్యా ప్రాముఖ్యతను వివరించారు. ఇలా విభిన్న దృక్కోణాలు కలిగిన మీరంతా కలసి పని చేస్తే భవిష్యత్ మీదే అంటూ విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు.

## పారిశుద్ధ్యంపై అవగాహన

విజయపురం, జూన్ 24 ప్రభాతవార్త: మండల కేంద్రమైన విజయపురం మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు, పంచాయతీ కార్యదర్శులకు, ఏఎన్ఎంలకు ఎంపీడీవో బ్రహ్మయ్య సోమవారం పారిశుధ్యం, డయేరియాపై అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రతి పంచాయతీలో పారిశుధ్య చర్యలు మెరుగు పరచాలని సూచించారు. గ్రామాల్లో మురుగునీరు చేరకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో హరిప్రసాద్‌వర్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శ్రీకాంత్, వైద్యాధికారులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ

విజయపురం, జూన్ 24 ప్రభాతవార్త: మండలంలోని కాళికాపురం, కేవీ పురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం యువ ఇంజనీర్లు భాస్కర్‌రాజు, ఢిల్లీ వర్మ, సుధీర్‌వర్మ, శ్రీనివాస్, బాలసుబ్రహ్మణ్యం తదితరులు విద్యా సామగ్రి వితరణ అందించారు. విద్యార్థులకు కావలసిన నోటు పుస్తకాలు, పెన్సిల్, తదితరవి వితరణగా అందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరమౌదాం... చదువులకు దగ్గరౌదాం

**డివైయస్‌పి ఉమామహేశ్వర్‌రెడ్డి**



శ్రీకాళహస్తి జూన్ 24 ప్రభాతవార్త : విద్యార్థి దశ కీలకమైనదని ఈ దశలో ప్రతి ఒక్కరు జాగ్రత్తగా మసలుకోవాలని డివైయస్‌పి ఉమామహేశ్వరరెడ్డి పిలుపు నిచ్చారు. తిరుపతి ఎస్‌పి ఆదేశాల మేరకు పట్టణంలోని కళాశాలల్లో మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన సదస్సులను నిర్వహించారు. వంశీ జూనియర్ కళాశాల లో నిర్వహించిన అవగాహన సదస్సులో డివైయస్ పి మాట్లాడుతూ నేడు సమాజంలో విద్యార్థిదశలో కొందరు మాదక ద్రవ్యాలు, గంజాయికి అలవాటు పడుతున్నారని దాని వల్ల వారి జీవితాలు గుల్ల కావటమే కాకుండా కుటుంబాలు బాధలకు గురౌతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రతి తల్లిదండ్రి తమ బిడ్డలను క్రమశిక్షణతో పెంచాలంటే వారిని చదివించాలని సూచించారు. చదువుకుంటున్న వారిలో కొందరు విద్యార్థులు మత్తుమందు, గంజాయికి అలవాటు పడి బానిసలౌతున్నారని ఈ వాతావరణం మారాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో డివైయస్‌పితో పాటు ఒకట టౌన్ స్టేషన్ సిఐ నరసింహారావు, ఎస్ఇబి సిఐ దశరథరామిరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ శ్రీకాంత్ శర్మ, కరస్పాండెంట్ రవీంద్రప్రసాద్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## రాచగున్నేరి విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు

శ్రీకాళహస్తిరూరల్ జూన్ 24 ప్రభాతవార్త : మండలంలోని రాచగున్నేరి పంచాయితీ జిల్లాపరిషత్ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం పాఠ్యపుస్తకాలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాచగున్నేరి పంచాయితీ మాజీ సర్పంచ్, జె.కె.స్టీల్స్ అధినేత తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బొల్లినేని. జగన్నాధంనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా పాఠ్యపుస్తకాలు, మూడు యూనిఫాం దుస్తులు, బ్యాగులు, బెల్టులు, షూలు అందజేశారు. ఈ కార్యక్రమంలోతెలుగుదేశం పార్టీ నాయకులు నర్రా చంద్రమౌళినాయుడు, మునిబాబు, మురళీ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు గిరిజ, లింకన్, శాంతకుమారి, ప్రజాప్రగతి ట్రస్టు ఇంచార్జ్ చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.

## విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి : హెచ్‌ఎం

రామచంద్రాపురం, జూన్ 24 ప్రభాతవార్త: విద్యతోనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించగలదని బలిజపల్లి యుపి స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి అన్నారు. సోమవారం పాఠశాల విద్యార్థులకు స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు విద్యా సామగ్రిని వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. బడుగు, బలహీన, పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలలకు దాతలు తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

**CHANGE OF NAME**

I, **DONTI GOVINDAMMA** (OldName), R/at Pathivandla palli, Peddabalijapalli, T Sundupalli, Annamayya Dist, AP, Old PP NO M6101337. Have changed my name to **YARRAPUREDDY GOVINDAMMA** W/O YARRAPUREDDY ESWAR REDDY (New Name).

## డయేరియా నిర్మూలనకు సమిష్టికృషితో పనిచేయాలి



తొట్టంబేడు, జూన్ 24 ప్రభాతవార్త : డయేరియా నిర్మూలనకు ప్రతి అధికారి, ప్రజాప్రతినిధులు అందరు సమిష్టిగా పని చేయాలని తహశీల్దార్ శివరామ సుబ్బయ్య పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో తహశీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపిడిఓ ఐజాక్ ప్రవీణ్, కాసారం పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ శివకుమార్ తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా తహశీల్దార్ శివరామ సుబ్బయ్య మాట్లాడుతూ ఈనెల 24వ తేదీ నుంచి 30వ తేదీ వరకు అన్ని గ్రామ పంచాయతీల్లో సిబ్బంది పర్యటించి త్రాగునీటి పథకాలను శుభ్రం చేయించడం కాచి చల్లార్చిన నీటిని త్రాగే విధంగా ప్రజలకు అవగాహన కల్పించడం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించడం, ప్రతి ఒక్కరు మరుగుదొడ్లను వాడేవిధంగా తెలియజేయడం తదితర కార్యక్రమాలను నిర్వహించి ప్రజల ఆరోగ్య భద్రతకు కృషి చేయాలని కోరారు. జూలై 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు ప్రతి గ్రామంలో ప్రజలకు డయేరియా వ్యాప్తి చెందకుండా పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఎంపిడిఓ కోరారు. సర్పంచ్‌ల సహకారంతో గ్రామ పంచాయతీ నిధుల నుంచి ఓవర్‌హెడ్‌ట్యాంకులను శుభ్రం చేయించి ప్రజలకు శుభ్రమైన తాగునీటిని అందించేలా చర్యలుతీసుకోవాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తప్పకుండా నీటి పరీక్షలు నిర్వహించాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఈ మమత తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఉపాధ్యాయులు విద్యార్థులకు శుద్దజలాన్ని అందించాలన్నారు. సమావేశంలో ఐసిడిఎస్ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొనే విధంగా ఎంఈఓ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, విఆర్‌ఓలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్యాంపస్ ఇంటర్వ్యూలో 10మంది ఎంపిక

తొట్టంబేడు, జూన్ 24 ప్రభాతవార్త : ఎస్పీఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జెకెసి విభాగం సారథ్యంలో సోమవారం నిర్వహించిన ఉద్యోగమేళ నిర్వహించారు. శ్రీజమహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ మరియు ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ఆటోమొబైల్ కంపెనీ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఉద్యోగ మేళాలో 25మంది హాజరుకాగా వరీఇలో 10మందిని ఎంపిచేయడం జరిగింది. ఎంపికయిన వారికి రూ.16వేల నుంచి రూ.25వేల వేతనం మరియు ఇతర అలెవెన్సులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎంపికైన వారిని ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీలత అభినందలు తెలిపారు.

**పబ్లిక్ నోటీసుకు బదులు ప్రకటన**

ఇందుమూలంగా యావన్మందికి నా కక్షిదారులు **కంచి లోకనాథరెడ్డి,** సున్నపు వీధి, తిరుపతి వారి తరపున తెలియజేయడం ఏమనగా! తేది.23.06.2024 తేదీన పృథ్వి ఆదిత్య ఇన్‌ఫ్రాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ వారి తరపున మేనేజింగ్ డైరెక్టర్ **ఎన్.రామగోవిందరెడ్డి గారు** వివిధ దినపత్రికలలో ప్రచురించిన పబ్లిక్ నోటీసుకు బదులు ప్రకటన ఏమనగా!

మా కక్షిదారులైన లేట్ కంచి రామిరెడ్డి కుమారుడు కంచి లోకనాధరెడ్డి వగైరాలపై పృథ్వి ఆదిత్య ఇన్‌ఫ్రాటెక్, హైదరాబాద్ అనువారు తిరుపతి 10వ అదనపు జిల్లా జడ్జి కోర్టు ముందు రెవెన్యూ రికార్డులు మరియు స్వాదీనానుభవం మరియు సొమ్ము వాపసు కొరకు వేసిన ఓ.ఎస్.నెం.66/2023 దావాలో మరియు అందులో వేసిన ఇంజంక్షన్ పిటీషన్ ఐ.ఎ.నెం.213/2023లో మా కక్షిదారు బదులు వేసినారు. కాని సదరు పై కనిన నోటీసులు, సదరు దావా స్పెసిఫిక్ పర్ఫామెన్స్ కొరకు వేసినట్టుగా తప్పుడు సమాచారము కనబరచినారు. మా కక్షిదారులు సదరు దావాను తోసిపుచ్చుట కొరకై ఐ.ఎ.నెం.81/2023 అను పిటీషన్‌ను దాఖలు చేసినారు. సదరు పృథ్వి ఆదిత్య ఇన్‌ఫ్రాటెక్, హైదరాబాద్ వారు సదరు మొదటి ప్రతివాది అయిన కంచి మునిక్రిష్ణారెడ్డి వారిపై దావాను వాపసు తీసుకొనుటకై మెమోను కూడా దాఖలు చేసినారు. పృథ్వి ఆదిత్య ఇన్‌ఫ్రాటెక్, హైదరాబాద్ సదరు తప్పుడు దావాను వేసి వాస్తవాలను కప్పిపుచ్చి ఇంజంక్షన్ ఉత్తర్వులు పొందినారు. సదరు విషయమై మా కక్షిదారుడైన కంచి లోకనాథరెడ్డి ఎప్పుడూ కోర్టు ఉత్తర్వులను ధిక్కరించలేదు. సదరు నోటీసు షెడ్యూలు దాఖలా ఆస్తులపై పృథ్వి ఆదిత్య ఇన్‌ఫ్రాటెక్, హైదరాబాద్ వారికి హక్కు బాధ్యతలు మరియు స్వాధీనము లేవు. సదరు కంపెనీ వారు కోరిన సొమ్ము వాపసు ఇవ్వవలసిన బాధ్యత లేదు. సదరు కంపెనీ వారు దినపత్రికలలో తప్పుడు విషయములు ప్రచురించినారు. మా కక్షిదారుడైన కంచి లోకనాథరెడ్డి పిత్రార్జితమైన సదరు ఆస్తి అభివృద్ధి కొరకు తనకు పూర్తి హక్కు కలదు. మా కక్షిదారుడు పై సదరు పృథ్వి ఆదిత్య ఇన్‌ఫ్రాటెక్ హైదరాబాద్ తప్పుడు దావా వేసి మరియు అవాస్తవ విషయాలతో ప్రజలను తప్పుదారి పట్టించుటకు తప్పుడు నోటీసులు ప్రచురించినందుకు మా కక్షిదారుడు తీసుకొను సివిల్ క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని హెచ్చరించడమైనది.

**ఎం.మోహన్ రాజు,** అడ్వకేట్, తిరుపతి, సెల్: 9347036274

## ఎంపీగా దగ్గుమళ్ళ ప్రమాణ స్వీకారం



చిత్తూరు, జూన్ 24 ప్రభాతవార్త: చిత్తూరు ఎంపీగా ఎన్నికైన దగ్గుమళ్ళ ప్రసాదరావు సోమవారం పార్లమెంటు లోని లోక్‌సభలో ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. 2024 పార్లమెంటు ఎన్నికల్లో చిత్తూరు నుండి తెలుగుదేశం పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన దగ్గుమళ్ళ ప్రసాదరావు ఈ ఎన్నికల్లో 2.23 లక్షల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. చట్టసభల్లోకి మొదటి సారిగా అడుగుపెట్టిన ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎంపీ సభ వెలుపలికి వచ్చి మాట్లాడుతూ తమ అధినేత తనపై పెట్టుకొన్న నమ్మకంను వమ్ము చేయకుండా చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, జూన్ 24 ప్రభాతవార్త : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఉద్దేశించి తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అధితి సింగ్ తెలిపారు. తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కమిషనర్ అధితి సింగ్ ప్రజల నుంచి ఫిర్యాదులను, వినతులను స్వీకరించగా మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను, వినతులను కమిషనర్ స్వీకరిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, అధికారులతో చర్చించి, సమస్యలను పరిశీలించి త్వరగా ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఆధ్వర్యంలో కమిషనర్‌ని కలిసి వినతి పత్రం అందజేస్తూ నగరంలోని నాలుగు అన్నా క్యాంటిన్లను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, అదే విధంగా రద్దీ వున్న ప్రాంతాల్లో అదనంగా అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని కోరడంతో, కమిషనర్ స్పందిస్తూ ఇప్పటికే మూడు అన్న క్యాంటీన్లు ఖాళీ చేయించడం జరిగిందని, మరోవారం లోపు మరో దానిని కూడా ఖాళీ చేయించి అన్న క్యాంటీన్ల నిర్వహణ కోసం సిద్ధం చేయిస్తామన్నారు. పలు సమస్యలు పరిష్కరించాలనే ఫిర్యాదుపై కమిషనర్ అధితి సింగ్ స్పందిస్తూ తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, కెఎల్ వర్మ, డిప్యూటీ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం తదితర అధికారులు పాల్గొన్నారు.

## సిఎంకు స్వాగతం పలుకుతూ భారీగా ఫ్లెక్సీలు

కుప్పంరూరల్, జూన్ 24 ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుప్పం పర్యటన సందర్భంగా కుప్పం ప్రాంతంలోని రోడ్ల పక్కన భారీగా ఫ్లెక్సీలను తెలుగుతమ్ముళ్ల ఏర్పాటుచేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి దారి పొడగునా కుప్పం పట్టణం అంతా ఎటు చూసినా సిఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతూ ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు కన్పిస్తున్నాయి.పట్టణం ఫ్లెక్సీలతో పసుపుమయంగా మారిపోయింది.




## కళ్యాణం కమనీయం... ద్రౌపదమ్మ అమ్మవారి వివాహ వేడుకలు



వెదురుకుప్పం, జూన్ 22 ప్రభాతవార్త : చవటగుంట మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అత్యంత వైభవంగా కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ముందుగా ఆలయం శుద్ధి చేసి పురోహితులచే వివిధ అభిషేక, పూజలు నిర్వహించారు. అమ్మవారిని పట్టు వస్త్రలు, పూలు, ఆభరణాలతో విశేషంగా అలంకరించి వివాహ వేడుకలకు ముస్తాబు చేశారు. ఆలయం ఆవరణంలో అమ్మవారి వివాహ వేడుకలకు చలువ పందిరిలు వేయించి పూలతో కళ్యాణ వేదికను ప్రత్యేకంగా తయారు చేశారు. తరువాత అమ్మవారి ఉత్సవమూర్తిని అమ్మగారి గ్రామమైన వెదురుకుప్పంకు దప్పుల దరువులతో ఊరేగింపుగా తీసుకురావడం జరిగింది. వివాహ ఉభయదాత పేట నీరజారాధాకృష్ణా రెడ్డి ఇంటికి తీసుకువెళ్ళి శాస్త్రయుక్తంగా అమ్మవారి ఉత్సవ విగ్రహంకు ముత్తైదువులతో నలుగులు పెట్టి పట్టు వస్త్రలు,ఆభరణాలు, పూలతో అలకరించి గ్రామంలో మంగళవాద్యల నడుమ ఊరేగింపు చేశారు. మహిళ భక్తులతో అమ్మవారిని భారీ ఊరేగింపుతో భక్తిశ్రద్ధ లతో ఆలయం వద్దకు తీసుకువచ్చారు. అనంతరం వేద పండితుల వేద మంత్రాల నడుమ సంప్రదాయంగా శాస్త్రయుక్తంగా మంగళవాద్యల నడుమ అమ్మవారికి, పంచపాడవులకు వేడుకగా వివాహం జరిపించారు. వివాహ వేడుకలకు చుట్టుప్రక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరుకావడం జరిగింది. అమ్మవారి వివాహ వేడుకలు తరువాత భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారికి భక్తులు కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వివాహ అనంతరం అమ్మవారిని పంచ పాండవుల ఉత్సవ మూర్తులను అమ్మగారి గ్రామంకు ఊరేగింపుగా తీసుకువెళ్ళడం జరిగింది. తరువాత ఆలయం ప్రాంగణంలోని మడ వీధుల్లో పుష్ప పల్లకి సేవ నిర్వహించారు. వివాహ వేడుకలకు ఆలయ ధర్మకర్త నీరజారాధాకృష్ణా రెడ్డి, వ్యవహరించారు. వివాహ వేడుకలకు హాజరైన భక్తులు అన్నప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణా రెడ్డి, కార్యనిర్వహకులు ఆంజనేయులు రెడ్డి,కృష్ణా రెడ్డి, నరసింహ రెడ్డి, జీవన్‌బాబు, ఆనంద రెడ్డి, జయరాం తదితరులు పాల్గొన్నారు.




## గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టంకు 100 అర్జీలు



చిత్తూరు, జూన్ 24 ప్రభాతవార్త: కలెక్టరేట్‌లో ప్రజా సమస్యలను పరిష్కరించడానికి సోమవారం కలెక్టర్ సుమిత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టంకు జిల్లా నలుమూలల ప్రజల నుండి సమస్యలపై వంద అర్జీలు అందాయి. నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సుమిత్‌కుమార్ గ్రీవెన్స్‌దేకు హాజరై ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను పరిశీలించిన కలెక్టర్ సత్వరం సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు డిఆర్‌ఓ బి.పుల్లయ్య, డ్వామా పిడి రాజశేఖర్‌లు పాల్గొని ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నూతన కలెక్టర్‌ను కలసిన జాయింట్ కలెక్టర్



కుప్పం, జూన్ 24 ప్రభాతవార్త : చిత్తూరు జిల్లా నూతన కలెక్టర్‌గా సోమవారం గాంధీ సుమిత్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. అనంతరం చిత్తూరు నుంచి నేరుగా కలెక్టర్ సుమిత్‌కుమార్ కుప్పానికి చేరుకున్నారు. ఈసందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో జిల్లా కలెక్టర్‌ను జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు మర్యాద పూర్వకంగా కలసి మొక్కను అందించి స్వాగతం పలికారు.




## కాణిపాకం సన్నిధిలో నూతన జిల్లా కలెక్టర్



కాణిపాకం, జూన్ 24 ప్రభాతవార్త: జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సుమిత్‌కుమార్ సోమవారం విఘ్నునాధుడైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ వెంకటేశు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈయనకు వేదమండపంలో వేదాశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. అలాగే శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా కలెక్టర్ పూజలు నిర్వహించారు. ఆయన వెంట స్థానిక రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పాశింకు ఘన స్వాగతం

### గజమాలతో సత్కరించిన టిడిపి శ్రేణులు



గూడూరు, జూన్ 24 ప్రభాతవార్త: ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌కు టిడిపి శ్రేణులు ఘన స్వాగతం పలికారు. గూడూరు విఘ్నేశ్వర పురం నుండి గాంధీ బొమ్మ, రాజా వీధి మీదుగా టవర్ క్లాక్ సెంటర్ మీదుగా పార్టీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం టిడిపి నేతలు బాణ సంచా పేల్చి స్వీట్లు పంచి పెట్టారు. క్రేన్ సహాయంతో గజమాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిదని అన్నారు. నా పై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని వారి సమస్యలు పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. గూడూరు పట్టణంలో మౌలిక వసతులు కల్పనకు పార్టీ ఆఫీసులో కాల్ సెంటర్ కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గూడూరు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. గూడూరు మున్సిపాలిటీకి ఎన్నికల జరిగేలా అధిష్టానంతో మాట్లాడుతానని ఆయన తెలిపారు. ఈయన వెంట ప్రముఖ పారిశ్రామిక వేత్త తానంకి నానాజీ, నాయకులు భాస్కర్ రెడ్డి, రహీమ్, బిల్లు చెంచు రామయ్య, గుండాల లీలావతి, పులిమి శ్రీనివాసులు, ఉచ్చూరు వెంకటేశ్వర్ రెడ్డి, సోమిశెట్టి చెంచు రామయ్య, ఆరికట్ల మస్తాన్ నాయుడు, వాటంబేడు శివకుమార్, నాయకులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




## నాటుతుపాకి స్వాధీనం ఇద్దరు వేటగాళ్లపట్టివేత



భాకరాపేట,జూన్24ప్రభాతవార్త : చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట అటవీ బీటులో వేట సాగిస్తున్న ఇద్దరిని పట్టుకుని వారి వద్ద నుంచి నాటుతుపాకి దుప్పి మాంసం స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ దత్తాత్రేయ తెలిపారు. వారికి రాబడిన సమాచారం మేరకు ఈనెల 23వ తేదీ రాత్రి భాకరాపేట అటవీ ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. ఆసమయంలో వెదురుకుప్పం మండలానికి చెందిన సురేష్, శ్రీనివాసులు నాటు తుపాకితో తారసపడ్డారు. వెంటనే వారిని పట్టుకుని తుపాకీ స్వాదీనం చేసుకుని తనిఖీ చేయగా వారి వద్ద కణితి మాంసం లభించింది. వాటితో పాటు కేటీఎం డ్యూక్ వాహనం పట్టుబడింది. ఇద్దరిని సోమవారం ఆరెస్టు చేసి పీలేరు కోర్టుకు తరలించినట్లు ఆయన చెప్పారు. ఈదాడిలో ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ తౌఫిక్‌ఇస్లాం, ఎఫ్‌బీఓలు సదాసివయ్య, లోకనాథం, డ్రేవర్లు శంకర్, రోహిత్,బేస్‌క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తులకు అందుబాటులోకి తెస్తాం

### -అక్రమకట్టడాలను తొలగిస్తాం -జనసేన నేత కిరణ్‌రాయల్



తిరుమల,జూన్ 24ప్రభాతవార్తప్రతినిధి: తిరుమల కొండపై భక్తుల పేరుతో పలు మఠాధిపతులు, స్వామీజీలు నిర్మించిన మఠాలు వైసిపి నేతల చేతుల్లో ఉన్నాయని, వాటిని టిటిడి స్వాధీనం చేసుకోవాలని జనసేననేతలు డిమాండ్ చేశారు. తిరుమలలోని గోగర్భమ్‌డ్యామ్ సమీపంలో విశాఖ శారదాపీఠంకు చెందిన స్వరూపానందస్వామి మఠం అక్రమంగా నిర్మించారని, అంతేగాక అదనంగా స్థలం ఆక్రమించుకుని మరింతగా నిర్మాణలు చేశారని జనసేన నేతలు ఆరోపించారు. తిరుపతికి చెందిన జనసేన ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్, హరిప్రసాద్, లోకేశ్, జీవన్, సుమన్‌బాబు,కిషోర్,మంజుతో కలసి విశాఖ శారదాపీఠం మఠం, ఇతర మఠాలను తనిఖీ చేశారు. వైసిపి నేతలు మఠాల పేరుతో పెద్ద ఎత్తున భక్తులను దోపిడీ చేస్తున్నారని, అక్రమ కట్టడాలకు పాల్పడుతున్నారన్నారు. వీటన్నిటినీ జనసేన అడ్డుకుని అక్రమకట్టడాలను తొలగించేలా టిటిడి ఇఒ శ్యామలరావు దృష్టికి తీసుకెళతామన్నారు.




## వేలం పాటలో గందరగోళం

### -డిడిల కోసం పరుగులు తీసిన రైతాంగం



రాజనాలబండ(చౌడేపల్లి), జూన్ 24 ప్రభాతవార్త : రాజనాలబండ లక్ష్మీనరసింహస్వామి మాన్యం భూముల లీజు వేలంపాటల్లో గందరగోళ పరిస్థితి నెలకొనింది. సంవత్సరం క్రితం రాజనాబండ టిటిడి ఆధీనంలోకి వెళ్ళింది. దేవస్థానానికి సంబంధించిన వివిధ ప్రాంతాల్లోని 21.21ఎకరాల భూమి లీజు విషయంలో టిటిడి ఆధ్వర్యంలో వేలం పాటను బండపై నిర్వహించారు. ఇప్పటి వరకు రాష్ట్ర దేవాదాయధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో నేరుగా వేలం పాట నిర్వహించేవారు. ఎప్పటిలాగే జరుగుతుంది రైతులు పాల్గొన్నారు. అయితే టిటిడి నిర్వహించే వేలం పాటలో ముందుగా రైతులు ఇఓ పేరును బ్యాంకుల నుంచి డిడి తీయాల్సివుంటుందనీ, అనంతరం పాటలో పాల్గొనాలని టిటిడి తహశీల్దార్ లలితాంజలి రైతులకు తెలపడంతో రైతులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. కొంతసేపు అధికారులతో చర్చించినా ప్రయోజనం లేకపోవడంతో బ్యాంకులకు పరుగులు తీశారు. చివరకు పలు చోట్ల మామిడి ఫలసాయం మినహా భూమి లీజుకు జరిగిన వేలం పాటలో రూ. 60వేలు స్వామివారికి ఆదాయంగా సమకూరినట్లు అధికారులు తెలిపారు. ప్రధానార్చకుడు కృష్ణమూర్తి, టిటిడి అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లలో హాకర్ల అడ్డారాజ్యం

### -క్యూలైన్లలో అధిక ధరలు



తిరుమల,జూన్ 24ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవారి దర్శనార్థమ్ వస్తున్న భక్తులను వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లో హాకర్లు ధరల దోపిడీ చేస్తున్నారు. వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్ క్యూలైన్ల వద్దఅనధికార హాకర్లు శీతలపానీయాలను 10 రూపాయలు ప్యాకెట్లను 20రూపాయలకు, 25 రూపాయలవరకు అధిక ధరకు విక్రయించి భక్తులను దోపిడీ చేస్తున్నారు. ఈ చెత్తాచెదారాలు అలాగే పేరుకు పోయాయి. ఇవన్నీ కట్టడి చేసి చర్యలు తీసుకోవాల్సిన సెక్టార్ 2 వైకుంఠమ్ ఏవిఎస్ఒ ,విజిలెన్స్ సిబ్బంది మొక్కుబడిగా విధులు నిర్వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి .




## ఆకట్టుకున్న ఆధ్యాత్మిక ప్రవచనాలు

తిరుపతి,జూన్ 24ప్రభాతవార్త: అన్నమాచార్యకళామందిరంలో జరుగుతున్న ఆధ్యాత్మిక ప్రవచనాలు నగర ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.ప్రవచనకర్త గరికపాటిరమేశ్‌బాబు సోమవారం సాయంత్రం ఆంధ్ర మహాభారతం స్వర్గారోహణ పర్వంపై ప్రవచనాలను వినిపించారు. ఈ ప్రవచనాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, టీచర్ తిరుమలయ్య, కో ఆర్డినేటర్ కోకిల, సిద్దారెడ్డి, కొట్టే సుబ్రమణ్యం తదితరులు ప్రవచనకర్త రమేశ్‌బాబును సన్మానించారు.

## మంత్రి నారాలోకేష్‌కు కాశీవిశ్వనాధుని ప్రసాదాలు



శ్రీకాళహస్తి, జూన్ 24 ప్రభాతవార్త: రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్, ఆర్ అండ్ బిశాఖ మంత్రి నారాలోకేష్‌కు గాండ్ల తెలికుల బిసి సాధికార సమితి రాష్ట్ర సభ్యులు కన్నావరం హరిబాబు మర్యాదపూర్వకలసి కాశీవిశ్వనాధుని తీర్థప్రసాదాలు అందించారు. సోమవారం సచివాలయంలో ఆయన చాంబర్‌లో కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కన్నావరం హరిబాబు మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ అధికారంలోకివచ్చిన వెంటనే తాను మొక్కు తీర్చుకున్నానని తెలిపారు. సంక్షేమ పాలన సాకారం కావాలంటే తెలుగుదేశంపార్టీకే సాధ్యమన్నారు.

## సెంటర్ ఆఫ్ కాంపిటెన్స్ కోసం ఎస్రీ ఇండియా, ఐఐటీ భాగస్వామ్యం

తిరుపతి విద్య, జూన్ 24, ప్రభాతవార్త : తిరుపతిలో భౌగోళిక సాంకేతికతలతో ఆవిష్కరణలు, అడ్వాన్స్ లెర్నింగ్ కోసం సెంటర్ ఆఫ్ కాంపిటెన్స్ స్థాపించేందుకు జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (జీఐఎస్) సాఫ్ట్‌వేర్, సొల్యూషన్స్‌లో అగ్రగామిగా ఎస్రీ ఇండియా, ఐఐటీ తిరుపతి నవవిష్కర్ ఐ హబ్ ఫౌండేషన్ (ఐఐటీటీఎన్ఐఎఫ్) అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. అత్యాధునిక సాఫ్ట్ వేర్, వనరులు, నిపుణుల నేతృత్వంలోని యాక్సెస్‌ను అందించడం ద్వారా విద్యార్థులు, ఫ్యాకల్టీలు, స్టార్టప్‌లు, వర్కింగ్ ప్రొఫెషనల్స్‌లో భౌగోళిక ఆలోచనను ప్రోత్సహించడం, భౌగోళిక సాంకేతికతను నేర్చుకోవడం, పరిశోధన, అభివృద్ధి కోసం ఈ సెంటర్ ఆఫ్ కాంపిటెన్స్ కేంద్రంగా పని చేస్తుంది. ఇంకా జీఐఎస్, ఏఐ, ఎంఎల్, డేటా సైన్స్ డేటా అనలిటిక్స్, డొమైన్‌లలో కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్‌లు విద్యార్థులకు టెక్నాలజీలో తాజా ట్రెండ్‌లను అన్వేషించడంలో సహాయపడతాయి. సవాళ్ల పరిష్కారం, అన్వయించడం నేర్చుకుంటారు. తద్వారా భౌగోళిక రంగంలో ఆశాజనకమైన కెరీర్‌లకు సిద్ధంగా ఉంటారు. ఈ జ్ఞానం, నైపుణ్యం, దేశ సామాజిక, ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుంది అని డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్రీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

